# విశాఖపట్నం సెంటర్

Telephone No. 0891-2513506
E-mail ID ambvisakhapatnamcentre@gmail.com
Behind Hindustan Shipyard Junior College,
GANDHIGRAM, VISAKHAPATNAM- 530005

విశాఖపట్నం సెంటరు నూతన కార్యనిర్వాహక సభ్యులను ఏప్రిల్ **26**న ఎంపికచేశారు. ఆ వివరాలు ఇలా వున్నాయి.

| Sl.No | Name | Elected as | Address/Phone No |
|---|---|---|---|
| 1 | L.V.R.Murty | Hony. President | 49-11-14/1, Lalithanagar,Vizag-16 Phone 0891-2589556 Mobile 9490753474 |
| 2 | P.Nikunj | Hony. Vice President | 2nd floor Plot No.179 Sector-8MVP Colony, Vizag-17Ph. 9397071609 |
| 3 | P.S.Prakash Meher | Hony. Secretary | 43-34-15/13, TF-3 Siddi Enclave Rly.New Colony, Vizag-530 016 Phone 0891-2529095 Mobile 9849645057 e-mail: prakashmeher@ymail.com |
| 4 | M.Hari Meher | Hony. Jt.Secretary | 54-11-20, IsukathotaVizag-22 Ph. 9246625646 |
| 5 | T.A.Narayana | Hony. Treasurer | 9-13-25 (II floor), Resapuvani Palem,Vizag-13 Ph. 9966427565 |
| 6 | K.Pallava Raju | Hony. Auditor | 6-42, Santhoshi Nagar, Simha-chalam Vizag-28 Ph.2765615 |
| 7 | K.V.Ratnam | Hony. Member | Ph.9440403429 |
| 8 | T.D.S.Murty | Hony. Member | Ph.2504043 |
| 9 | G.T.Naidu | Hony. Member | Ph. 2559783; (M) 9490753466 |
| 10 | Y.Neelachalam | Hony. Member | Ph. 6648174; (M) 9290100995 |
| 11 | G.Satyanarayana | Hony. Member | Ph. 2710471 (PP) |
| 12 | A.Seetha | Hony. Member | Ph. 9989298187 |
| 13 | B.Sarala | Hony. Member | Ph. 9885069324 |

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/ RNP/789/2009-11, Dt.07-01-2009

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి : 8 సంచిక: 01 హైదరాబాద్ 2009 మే పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**



# వర్ని సెంటర్ 6వ వార్షికోత్సవము

**వర్ని** సెంటరు 6వ వార్షికోత్సవం సందర్భంగా **7.6.2009** ఆదివారం అవతార్ మెహెర్‌బాబా సెంటరు, **వర్నిలో** "ప్రేమికసహవాస్" ఏర్పాటు చేసినట్లు మెహెర్‌బాబా ప్రేమికులు ఈ కార్యక్రమములో పాల్గొని అవతార్ మెహెర్‌బాబా ప్రేమాశీస్సులు పొందగలరని సెంటర్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# కామారెడ్డి సెంటర్ వార్షికోత్సవము

అవతార్ మెహెర్‌బాబా ప్రేమాలయము కామారెడ్డి24వ వార్షికోత్సవము **1.05.2009న ఘనంగా** జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా శ్రీ బి. రామక్రిష్ణయ్య హాజరయ్యారు. ఉదయం నగర సంకీర్తన , సప్తవర్ణపతాకావిష్కరణ – శ్రీ ఆంజనేయులు (హైదరాబాద్), శ్రీ యం. మల్లిఖార్జునరావు (హైదరాబాద్) ధుని వెలిగించారు. కామారెడ్డి, సిరిసిల్ల, కంకల్ బాబా ప్రేమికులు భజనలు చేశారు. డాక్టర్ చంద్రయ్య, శ్రీమతి రుక్మిణి, శ్రీ యన్. లక్ష్మీనారాయణ, శ్రీ కిషన్‌రావు, కరీంనగర్, పి.యస్.కె. శర్మ, యన్. విఠల్, వై. శ్రీనివాస్ తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు.

# విజ్ఞప్తి

మెహెర్‌బాబా పత్రికకు వార్షిక చందా రూ. 100/– లేదా జీవిత సభ్యత్వం రూ. 1000/– చెల్లించండి. పత్రిక పురోభివృద్ధికి సహకరించండి. మా అడ్రస్సు ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్‌కాలనీ , సికింద్రాబాద్–500 087 ఫోన్: 99595–53218

●●●

మెహెర్‌బాబా పత్రిక ప్రతి నెలా 19 లేదా 20వ తేదినాడు పోస్టు చేయుచున్నాం. పత్రిక మీ ఇంటికి 25వ తేదీలోగా చేరుతుంది. ఏ కారణంగానైనా 25వ తేది నాటికి అందని పక్షంలో మీ సమీప పోస్టాఫీసువార్ని సంప్రదించవల్సింది. లేనిఎడల బాబా ప్రేమికులు **శ్రీ యన్. మహేశ్వర్‌రావు –040– 27964050, 9441218841, శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్– 94403–65640,** హైదరాబాద్‌లను సంప్రదించగలరు.





# మెహెర్ సందేశం



**Obedience is the outcome of Love.**

**విధేయత ప్రేమ నుండే ఉద్భవిస్తుంది.**

– మెహెర్‌బాబా

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595–53218,**
**krishnanandm@yahoo.com**

***వ్యవస్థాపకులు:***
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్–500 087
ఫోన్: 99595–53218

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. రుస్తుం ఫలహాతి 6–12
3. ఎవరీ హైదరాబాది 13–15
4. మీకు తెలుసా??? 16–17
5. ఎండాకాలంలో చల్లని నీడలా 18–19
6. లార్డ్ మెహెర్ 20–28
7. బాటసారులు 30–31
8. పుస్తక సమీక్ష 32–33
9. భైరమంగళలో ప్రేమిక సహవాస్ 34–38
10. జీవిత సభ్యులు 39

### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# విశ్వప్రేమ ఉత్సవం - హమీర్‌పూర్‌లో

అవతార్ మెహెర్‌బాబా హమీర్‌పూర్ నందు ఇచ్చిన ప్రథమ పావన దర్శన జ్ఞాపకాల విశ్వప్రేమ ఉత్సవం మెహెర్‌పురి - హమీర్‌పూర్‌లో 2009 నవంబర్ 17,18,19 తేదీలలో ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు ఒక ఆహ్వానం తెలిపారు. కాగా, అవతార్ థామ్- ఇంగోటా, (20 నవంబర్ 2009), మెహెర్‌వాన్‌థామ్- మౌదహా (21 నవంబర్ 2009), మెహెర్ ఆస్థానా - (మహేవా) (22, 23 నవంబర్ 2009), మెహెర్‌థామ్ - నౌరంగా (25,26 నవంబర్ 2009)లలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# కరీంనగర్ జిల్లా - తెట్టెకుంటలో

2009 జూన్ 13,14, తేదీలలో కరీంనగర్ జిల్లా తెట్టకుంట అగ్రహారంలో గల అవతార్ మెహెర్‌బాబా సెంటర్- **అపర మెహెరాబాద్-** 7వ వార్షికోత్సవం మరియు అంతర్జాతీయ అవతార్ ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు డి. ప్రభాకర్ రావు, ఛైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరు బాబా ప్రేమికులు తమ వివరాలు ఏప్రిల్ 10లోగా D. Prabhakar Rao, Chairman, Avatar Meher Baba Charitable Trust (Temple) , H.No.3-8-72/2/A/1, Mehernagar, Shanthinagar Road, SIRCILLA, KARIMNAGAR, Cell: 9396931448, 9441865485 కు పంపవల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# వరుడు కావలెను

**అమ్మాయి పేరు. షీలా. ఎత్తు 5.9, యం.కాం., యం.బి.ఏ., రోహిణి. 3వ పాదం, జన్మతేది 1979 ఏప్రిల్ 2, ఉద్యోగస్థురాలు, వరుడు బ్రాహ్మణుడై, బాగా చదువుకుని ఉద్యోగస్థుడై వుండాలి. మరిన్ని వివరాలకు కేరాఫ్ ఎడిటర్, మెహెర్‌బాబా, ఫోన్ 995955 3218 సంప్రదించగలరు.**

# ఉపనయనం

శ్రీ వాడ్రేవు రామారావు గారి మనుమడు చి॥ వి.మెహుల్ బాబాకు ఉపనయనం 10.05.2009 ఉ॥ 9.32 ని॥లకు భిలాస్‌పూర్‌లో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.





సంపాదకీయం

# ప్రేమ ముఖ్యం

మెహెర్‌బాబా భజనలు, ప్రేమిక సహవాస్‌లు పలు ప్రాంతాల్లో విశేషంగా నిర్వహిస్తున్నారు.

ఇటీవల మెహెరస్థాన్‌లో, ఖైరమంగళలో భారీ ఎత్తున సమావేశాలు నిర్వహించారు.

ఎందరో బాబా ప్రేమికులు ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు.

అనాదిగా బాబావారి సత్సంగ్ కార్యక్రమాలు అనేక ప్రాంతాల్లో జరుగుతున్నాయి.

బాబావారి కార్యక్రమాల ఏర్పాటులో బాబా మనకు ఎంతో వెసలుబాటు కల్పించారు.

ఆయన ఎలాంటి పూజాది క్రతువులు అవసరం లేదన్నారు.

కర్మకాండలను బాబా అసలుకే వద్దన్నారు.

కేవలం మనసారా రోజుకు పధ్నాలుగుసార్లు తన నామం స్మరించమన్నారు.

బాబావారి సందేశాలు, ప్రవచనాలు కూడా చాలా సుళువుగా వుంటాయి. ఐతే, అవి ఆచరణలో అమలుచేయడంలోనే బాబా ప్రేమికులు ఎక్కువమంది విఫలమవుతున్నారు.

ఒకసారి ఏమయ్యిందంటే, ఒక బాబా సెంటరువారు వారి సత్సంగ్ సమయంలో బాబా చిత్రపటానికి చక్కని పూలహారంవేసి నమస్కరిస్తున్నారు. అనంతరం కర్పూర ఆరతిలిస్తున్నారు. బాబావారి కార్యదర్శి, శ్రీ ఆది. కె. ఇరానీ ఇది గమనించి, కర్పూర ఆరతులు, పూలహారాలు బాబా వద్దన్నారన్నారు. ఇది కర్మకాండలని ప్రోత్సహించడమేనన్నారు.

అక్కడి ప్రేమికులకి ఈ మాటలు నచ్చలేదు.

బాబాకి నేరుగా ఫిర్యాదు చేశారు.

బాబా తన సమాధానంగా, ఏ పనిచేసినా **ప్రేమతో,** మనస్సు లగ్నంచేసి చేయమన్నారు. యాంత్రికంగా ఎవరు ఏమిచేసినా అది కర్మకాండౌతుందని బాబా స్పష్టం చేశారు.

అన్నింటా ప్రేమ ముఖ్యం అని బాబా అన్నారు..

ఈ మాటలు మనకు ప్రాతస్మరణీయం కావాలి.

# రుస్తుం ఫలహోతి

**రుస్తుం ఫలహోతి- ప్రస్తుతం ముంబాయిలో ఉంటున్నారు. మెహెరాజాద్‌లోని బాబా మండలివారితో కలిసి పనిచేయాలన్నది ఆయనగారి కోరికల చిట్టాలో ప్రధానమైంది. 1989లో ఈ మేరకు మెహెరాజాద్ నుండి పిలుపురాగానే మెరైన్ ఇంజనీరుగా ఉన్న తన ఉద్యోగానికి రాజీనామాచేసి బాబా మండలివారిని చేరాడు. అలా బాబా మండలితో సుమారు 11 సంవత్సరాలు 2000 సంవత్సరందాకా మెహెరాజాద్‌లో ఉన్నారాయన. ఆ దశాబ్దకాలంలో బాబా మండలితో తన అనుభవాల దొంతరలను "నిజమైన నిధి" పేరిట ఇంగ్లీషులో గ్రందస్థంచేసి బాబా ప్రేమికులకులందరికి అందుబాటులో ఉండేలా చేసారు. ఈ సంచికలో రుస్తుం ఫలహోతి గురించి ఆయన మాటల్లోనే సంక్షిప్తంగా న్యూ ఢిల్లీ నుంచి శ్రీ మల్లాది రామారావు రాసి పంపారు. దయచేసి పరిశీలించండి.**

నమ్మండి. నమ్మకపొండి. నేను నాస్తికుడిని. దేముడు అంటే నమ్మకంలేదు. మెహెర్‌బాబా పేరు 1981లో అనుకొంటా మొదటిసారివిన్నాను. నేను బొంబాయి వచ్చినప్పుడు ఎవరో స్నేహితులు మెహెర్‌బాబాగురించి ప్రస్తావించారు. బాబా ఫోటో చూడగానే నాకేమి అనిపించిందో తెలుసా! 'ఇంకో బాబానా! బాబాలు మనకు కావాల్సినంతమంది ఇండియాలో వున్నారు కదా! కొత్తాయనదేనికట', అనుకొన్నాను. అంతకుముందు ఎప్పుడూ మెహెర్‌బాబా పేరు వినలేదేమో, ఈయన కూడా వో గొప్ప వ్యక్తేనా అనిపెదవి విరిచాను.

వాణిజ్యనౌకల్లో పని చేసేవాడిని. వాణిజ్య నౌకలంటే మీకు తెలుసుగా- దేశం నుంచి మరో దేశానికి సరుకులు రవాణా చేస్తాయి. ఈ నౌకల్లో పనిచేసేవాళ్ళ జీవితం సముద్రం పైనే గడిచిపోతుంది. ఎక్కే గడప, దిగే గడప అని అన్నట్లు మా పని వో రేవు నుంచి మరో రేవుకి పరిమితం. బొంబాయి వచ్చిన ప్రతిసారీ దేముడిపిచ్చి వున్నవాళ్ళు కనిపిస్తే, ప్రశ్నలతో వేధించేవాడిని. అలా ఇలాకాదు. మళ్ళీ వీడిమొహం చూడగూడదు అన్నంతగా విసిగించేవాడిని. అందరికీ తండ్రి దేముడు అంటారు కదా మరి, వొకరిని కుంటి సన్నాసినిచేశాడు. ఇంకొకరిని ఆరోగ్యవంతుని చేశాడు. ఎందుకిలా చేశాడో చెప్తారా అని అడిగేవాడిని. మనం అందరం భగవంతుడి పిల్లలమని మీరంటున్నారు. ఏ తండ్రి అయినా తన పిల్లలపట్ల ఇలా బేధభావం చూపిస్తాడా అని నేను నిలదీస్తుంటే, నా సామిరంగా, నా స్నేహితులు నోరువిప్పలేకపోయేవారు. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక వాళ్ళు సతమతమవుతుంటే నాకు భలే సరదావేసేది.





నాకిప్పుడు అనిపిస్తోంది. భగవదన్వేషణకి అందరూ రాచమార్గానవెడితే నేను డొంకతిరుగుమార్గం పట్టానేమో! ఏమోమరి? ఏది ఏమైతేనేం, బాబావారి ప్రవచనాలు చదివాను. బాబా నిజంగా గొప్ప ఆధ్యాత్మిక గురువు అనిపించింది. ఎలా ఎప్పుడు చదివావు అని అడగకండి. అది అంతా కాకతాళీయంగా జరిగింది. బహుశా బాబావారే అందుకు కారణం కావచ్చు. నా తికమక ప్రశ్నలకి జవాబు దొరికింది. బాబా పుస్తకంలో చాలా సాధికారకంగా వున్నాయా సమాధానాలు. నా అనుమానాలని పటాపంచలు చేశాయి. బాబా చెప్పిన తీరు నన్ను బాగా ప్రభావితం చేసింది. చాలా లాజికల్‌గా బాబా మాట్లాడారు అనిపించింది. వెంటనే బాబా జీవిత చరిత్ర చదివాను. బాబా జీవితంలోని ఘట్టాలు చూస్తుంటే ఈయన నిజంగా గొప్ప ఆధ్యాత్మిక పురుషుడేనా అన్న ధర్మసందేహం ఏర్పడింది. ఎంతోమంది ఆధ్యాత్మిక గురువుల గురించి విన్నానేమో, గురువు అంటే అందరిలా వుండరనీ, ఆ వ్యక్తిలో ఏదో కొంత విలక్షణత వుంటుందని నానమ్మకం. బాబా చరిత్ర చదివితే, ఆ నమ్మకంకాస్తా అపనమ్మకంగా మారింది.

సర్వాంతర్యామిని, సర్వజ్ఞానినీ అని బాబా అంటారు.

అంటే భూత భవిష్యత్ వర్తమానాలు తెలియాలికదా. రేపు ఏమిజరుగుతుందో తెలిసే వుంటుంది కదా. మరి బాబా మౌనవిరమణ చేయరేం? ఇదిగో ఫలానా రోజున మౌనవిరమణ చేస్తాను అప్పుడు మానవాళికి ఆధ్యాత్మికంగా ఎంతో మేలు జరుగుతుంది అంటారు. కానీ ఆ రోజున నోరు విప్పరు. మౌనంగానే వుంటారు. ప్రపంచంలోనూ ఏ మార్పు కనబడదు. ఇది సరిపోదన్నట్లు, "అబ్బే ఈవాళ కాదు, ఇంకోరోజున నేను మౌనవిరమణ చేయబోతున్నాను అంటారు. ఆ మాటా నిలబెట్టుకోరు. ఇదేమి బాబా ! ఇదేమి ధోరణి అనిపించింది. బాబా జీవితంలో జరిగిన అనేక సంఘటనలు నన్ను గందరగోళంలోపడేసేయి. వాటి తాత్పర్యమేమిటి తిరుమలేశా అనిపించి నాకు అంతుచిక్కలేదు.

వో ప్రక్క బాబా రచనలు నా జీవితంపై ప్రభావం చూపుతున్నాయి. మరోప్రక్క ఆయన జీవితం అంతుచిక్కటంలేదు. బాబాని చూస్తూ చూస్తూ గారడీవాడని కొట్టిపారేయలేను. చిత్తభ్రమలో వున్న వ్యక్తి అని అనిపించనే అనిపించదు.

బాబాని అర్థం చేసుకోవటం ఎలా! ఏమీ తోచేదికాదు. వుద్యోగం తప్పదు కాబట్టి, మా షిప్ ఎక్కడికి వెడితే అక్కడికి వెళ్ళేవాడిని.

ముంబాయికి వాపసు వచ్చిన ప్రతిసారీ అవతార్ మెహెర్‌బాబా సెంటరుకు వెళ్ళేవాడిని. వాళ్ళకి నామనసులో మాట ఎప్పుడూ చెప్పలేదనుకోండి. అదివేరే సంగతి. వాళ్ళుకూడా బాబా లేకపోయినా, బాబా మండలి వారు చాలామంది ఇంకా బ్రతికేవున్నారన్న సంగతి మాటల మధ్యలో కూడా అనలేదు. మండలివున్నది

అహమ్మద్‌నగరే కదా. ముంబాయికి పెద్ద దూరం లేదావూరు. మండలి గురించి ఎవరైనా చెప్పివుంటే, నగర్‌కి వెళ్ళి, వాళ్ళని కలిసి, నా ధర్మసందేహం తీర్చుకొనే వాడిని. ముంబాయి సెంటరువారెవరూ నాకా భాగ్యం కల్గించలేదు. సెంటరుకు వస్తున్నాడు కాబట్టి, ఇతగాడికి అన్ని విషయాలు తెలుసనుకొన్నారేమో, ఏమో మరి! ఏది ఏమయితేనేం, అలా నా ఆరాటం తీరలేదు. 1985లో అనుకొంటా. భావూ కల్చూరి ముంబాయి వచ్చారు. పశ్చిమ దేశాటనకి వెడుతున్నారాయన. ముంబాయిలో విమానం ఎక్కాలి కాబట్టి, సెంటరుకు వచ్చారు బాబాగురించి మాట్లాడారు. అలా ఆ ప్రకారంగా, మండలి వ్యక్తిని మొట్టమొదటిసారి కలిశాను. బాబాతో ఆయన జీవితానుభవాలు వింటుంటే ఒళ్ళు జలదరించింది. బాబా ఏకాంతవాసంలో వుంటే, భావూ బాబా బయట రాత్రిళ్ళు కాపలా కాసేవారు. ఈయన ఎంత అదృష్టవంతుడో అనిపించింది.

భావూ చాలా సేపు మాట్లాడారు. అనేక సంగతులు చెప్పారు. ఆయన ఉపన్యాసం పూర్తయ్యాక, వెళ్ళికలిశాను.

నాల్గేళ్ళబట్టి, నన్ను ఎన్నో ప్రశ్నలు కుదిపేస్తున్నాయి. వాటికి సమాధానం దొరకటంలేదన్నాను.

ఏమిటా ప్రశ్నలని అడిగారు.

కొన్ని ప్రశ్నలు చెప్పాను. సరే! రేపు చెప్తాలే అన్నారు. హవోవి దాదాచాన్జీ ఇంటికి రా. అక్కడ కలుస్తాను అన్నారు. నాకు మెహెర్‌బాబా గురించి 1981లో చెప్పింది ఈవిడే.

కానీ, మర్నాడు భావూ దగ్గరకి వెళ్ళాలనిపించలేదు. కనీసం ఆ మాట ఆయనకి చెప్పాలికదా! లేకపోతే పెద్దాయన నాకోసం ఎదురుచూస్తూ కుర్చుంటాడని ఫోను చేసాను. నాకు మాట్లాడే అవకాశం ఇస్తే కదా! ఇంకా ఏంచేస్తున్నావు. వెంటనే రా. నీ కోసం ఎదురు చుస్తున్నాను అని అంటూ భావూ ఫోను పెట్టేశారు.

నాకు చిరాకు వేసింది. ఏమిటీ పెద్దమనిషి! నేను రాలేనయ్యా అని చెప్పాలనుకొంటే, నన్ను మాట్లాడనివ్వలేదు సరికదా వెంటనే రమ్మనమంటాడని అనుకున్నాను. నేనుండేది వో మూల. ఆయన వున్నది మరోమూల. రమ్మంటే పరుగెత్తుకు వెళ్ళడానికి దగ్గరేమన్నానా. నాకు చిరాకు వేసింది. ఇలా లాభం లేదు. ఈయనకు తిక్క కుదర్చాలి. ప్రశ్నల వర్షం గుప్పించి, గజిబిజి చేసేయాలి. నాకు అర్థమయ్యేలా జవాబులైనా చెప్పాలి. బాబూ! నాకేం తెలియదని చేతులు అయినా ఎత్తేయాలి. అంతే తప్ప మరోదారి ఇవ్వకూడదు అనుకుంటూ భావూ వున్న చోటుకు వెళ్ళాను.

గంటసేపు మాట్లాడకొన్నాము. నా ప్రశ్నలకి చాలా వోపికగా జవాబిచ్చాడాయన. భావూజీ బాబామాటల్లో ఎంతో లోతైన అర్థాలని వెదికి చూపించారు. ఆయన మాటలు మనస్సుకి హత్తుకొన్నాయి. బాబా మాటలు, చేతలు ఆషామాషీవి కావని తెలిసవచ్చింది.





వెంటనే అనిపించింది, అహమ్మద్‌నగర్‌కి వెళ్ళితీరాలని, మిగతామండలివారిని కలవాలని, వాళ్ళని కలిస్తే, వూరట దొరుకుతుందనిపించింది.

వేసవి సెలవుల అనంతరం పిలిగ్రిమ్ సెంటరు తెరవగానే మెహెరాబాద్‌కి వెళ్ళాను. ఎండాకాలం పిలిగ్రిమ్ సెంటర్ మూసేస్తారు. మెహెరాబాద్‌లో అడుగుపెట్టానే అనిపించింది కదా 'ఇదేనా ఇల్లు. ఇక్కడే నేనుండాలి', అని.

మెహెరాబాద్ నుంచి మెహెరాజాద్‌కి వెళ్ళాను. కొత్తవూరు. కొత్త మనుషులు. ఎలా వుంటుందో అనుకొన్నాను. కొంచెం భయంభయంగా బస్సు దిగి మండలి హాలుకేసి నడిచాను.

గమ్మత్తు. నాకు ఎక్కడా కొత్తదనం కనబడలేదు. ఎంతో చాలాకాలంగా తెలిసినవూరు అనిపించింది. వీళ్ళంతా నాకు పాతస్నేహితులేనన్న భావన కలిగింది. నేను మెహెరాజాద్‌కి చెందినవాడిని. ఎప్పుడో ఇక్కడికి రావాల్సింది. ఇంతకాలంలో నేనుపడుతున్న గుంఝాలాటన, జీవితంలో ఎదురైన సాధకబాధకాల పేరు చెప్పి, ఇక్కడికి వచ్చానేమోననుకొన్నాను. బహుశా ఇక్కడికి రావడంలో నేను అంతర్గతంగా కోరుకొంటూ వచ్చానేమో! అందరూ, సరదాగా నవ్వుతూ పలకరించారు. ఇది నావూరే, కొత్త జాగా కాదన్న అభిప్రాయం ఏర్పడిందా? అబ్బే! అలా అనుకోకు, జీవితంలో మొట్టమొదటిసారిగా ఇక్కడ మెహెరాబాద్‌లో అడుపెట్టాక నా ఆత్మకి వూరట దొరికింది. ఇదొక మధురానుభూతి. చెపితే వినేవాళ్లకి వింతగా కనిపించవచ్చు. నమ్మశక్యం కాకపోవచ్చు. ఐనా సరే నా అనుభూతిని మీతో కొంచెమయినా పంచుకోవాలి. లేనిపక్షంలో, మండలితో గడిపిన రోజులగురించి నేను చెప్పేకబుర్లు మీ బుర్రకెక్కవు.

మండలి వారిదగ్గర నా ప్రశ్నలకి జవాబులు దొరికాయి. అందరి సమాధానాలు వొకేలా లేదు. ఒకరి జవాబు మరొకరి జవాబుకి పొంతన లేదు. అయితేనేం, మండలివారిమాటలు వింటుంటే, మనస్సు తేలికపడింది. అహా! ఎంత పొరపాటుచేసేను. తెలివితేటలు, వివేకం ఇవే సొత్తు అనుకొని, మనస్సుని గందరగోళంలో పడేశాను. భవోద్వేగాలమధ్య పడి, శ్లేష్మంలో ఈగలా గింజుకొంటున్న వారితో పోలిస్తే నేనెంత? నా సమస్య ఎంత? ఉద్యోగం, ప్రమోషను, డబ్బుసంపాదన, వీటికే అంకితమయ్యానింత కాలం. నాలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్న సంగతిని పట్టించుకోలేదు. మండలివారితో మాట్లాడుతుంటే, "అరే, దేముడున్నాడా, ఎలా వున్నాడు, ఏంచేస్తున్నాడు అంటూ నేను వేసే రకరకాల ప్రశ్నలకి" అర్థం లేదనిపించింది. మండలి చెప్పే జవాబులు నామనస్సుని తట్టిలేపాయి. నా హృదయానికి శక్తి నిచ్చాయి.

మన్నారిమాయి తెలుసుగా మీకు.

ప్లేనులు, చైతన్య భూమికల గురించి అడిగితే, ఎయిర్ ఇండియా విమానం గురించి

అడుగుతున్నావా? అమెరికా విమానాలగురించి ప్రశ్నిస్తున్నావాఅని ఆటపట్టించేది. ఏరుచ్‌ని అదే ప్రశ్న అడిగితే, ఎంతో ఓపికగా భూమికల్లోని వ్యత్యాసాలని, అరటిపండువొలిచి చేతిలో పెట్టినట్లు, వివరించేవాడు. ఇలా మన్సారీ, ఏరూచ్‌ల జవాబులు నన్ను సంతుష్టిపరిచాయి. 'నువ్వంటే మాకిష్టం. నీకు మా ప్రేమను పంచుతున్నాము, అని చెప్పకుండానే చెప్పినట్లనిపించింది. ఒక్క ఏరుచ్, మన్సారీయే కాదు, బాబా మండలిలోని ప్రతివొక్కరూ, తమని కలిసినవారితో ఇలానే వుంటారు.

ఉదయిస్తున్న సూర్యుడు అందరికీ వెలుతురునిస్తాడు. అందరికీ ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తాడు. అలానే, మండలివారు కూడా వాళ్ళ సమక్షానికి వెడితే ప్రేమవాహినిలో మనల్ని ముంచెత్తుతారు.

మండలివారి ప్రేమలో నా దృక్పథంలో స్పష్టత వచ్చింది. ఆధ్యాత్మికతకి కొత్త అర్థం దొరికింది. భక్తి అంటే ప్రేమాస్పదమైన జీవితంగడపడమని తెలిసివచ్చింది. మెహెరాబాద్, మెహెరాజాద్‌లో మండలి సమక్షంలో ప్రేమాస్పద జీవితం గడపాలనిపించింది.

అలా చేస్తేనే జీవితం సార్థకమవుతుంది.

కొద్దిరోజులకి బొంబాయి తిరిగివచ్చాను.

మళ్ళీ ఉద్యోగంలో చేరాను.

మెహెరాజాద్‌లో తెలుసుకొన్న జీవితసత్యాలని ఆచరణలో పెట్టాలనుకొన్నాను.

కాని ఇది ఎలా చేయాలి? అంతుచిక్కలేదు. మనస్సు మళ్ళీ పాత ధోరణిలో గజిబిజిగా మారింది. అక్కడ మెహెరాబాద్‌లో ఎంతో స్పష్టమయినవిగా కనబడిన సంగతులు, ఇక్కడ, బొంబాయిలో, నా షిఫ్‌పైన అంతుపట్టేవికావు. మండలివారి మాదిరిగా వుండాలని ప్రయత్నించేవాడని ఎంతో ప్రయత్నించినా, అక్కడ మెహెరాబాద్‌లో వుండే ప్రేమ, సహృద్భావం, ఇక్కడ, నా కార్యస్థానంలో వెలిసేవికావు.

అందుకని, వీలుచిక్కగానే, మెహెరాజాద్‌కి, మెహెరాబాద్‌కీ పరుగెత్తేవాడిని. అక్కడి వాతావరణంలో నా మనస్సు నిర్మలమయ్యేది. మండలివారితో కబుర్లు చెప్తుంటే మనసుకి ఎక్కడలేని వూరటా దొరికేది. మండలి వారితో కొద్ది రోజులున్నాను. అప్పటి నా అనుభవాలని చిన్న చిన్న కథలుగా వ్రాశాను. వీటిని చదివితే మీకే తెలుస్తుంది. ఎంతమధురమైన జ్ఞాపకాలో ఇవి అని.

కష్టాలు,బాధలు- ఇవే చాలా కథలకి ఇతివృత్తం.

ఎందుకని అడుగుతారా! బహుశా మనల్ని వేధించే ప్రశ్న- దేముడు ఇన్ని కష్టాలు పెడుతున్నాడనేకదా! నాస్తికవాదానికి కూడా ఈ ప్రశ్నే కారణం.

దేముడు నిజంగా ప్రేమమూర్తే!





ఐతే మనకష్టాలని తప్పించడేమనిఅంటూ చాలామంది భగవంతుడున్నాడంటే వొప్పుకోరు.

ఇహ దేముడిని నిత్యం ఆరాధించేవాళ్ళు కూడా గమ్మత్తు వ్యక్తులు.

కష్టాలు ఎదురుకాగానే, కృంగిపోతారు.

'హతవిధీ! నిన్నే నమ్ముకొన్న మాకేనా ఇన్ని కష్టాలు' అని వాపోతారు.

ఈ ప్రశ్న నన్ను వేధించింది. ఒకసారా, రెండుసార్లా చాలాసార్లు బాధపడకు అని మండలివారు చెప్పిన మాటలు నాకు ఉపశమనం కల్గించేవి. నా కథలు చదివితే మీకే తెలుస్తుంది, మండలి ఉవాచ ఎంత ఆసక్తికరమైనదో.

అందర్నీ పట్టికుదిపే ప్రశ్నలు ఎన్నో... ఎన్నెన్నో.....

ఏదైనా చెప్పండి, ఎందుకు అంటూ మొదలెడ్తారు.

నేనెలా చేస్తాను? నేను చేయగలనా?

ఇది తప్పించుకోవాలంటే ఏంచేయాలి? ఇది తప్పించుకోవాలంటే ఏం చేయాలి?

ఆ లక్ష్యాన్ని సాధించడమెలాగ?

ఇటువంటి అనేక ప్రశ్నలకి జవాబు ఒక్కటే - "ఆయన్ని స్మరించండి"- వినటానికీ, అనటానికీ స్మరణ చాలా చిన్నమాట. స్మరణ తేలికేమీకాదు.

నా మండలి కథల్లో **"స్మరణ"** మాధుర్యాన్ని మండలి వారి మాటల్లో చదవండి.

మరోమాట ఏ ప్రశ్న వేసినా, మండలివారు అదేదో మామూలు విషయమన్నట్లు మాట్లాడేవారు.

ఓహో! ఇంతేనా అనిపించేదినాకు కూడా.

కానీ, ఇప్పుడు, అనిపిస్తోంది, మాటలకందని అర్థాలని ఎంతో తేలికగా వివరించారు మండలివారు అని.

ఆ! ఏముంది, ఇందులో, ఇవన్నీ తెలియనిదెవరికి, అని పాఠకులు అనుకోవచ్చు.

మీకు నా మనవి ఒక్కటే.

మండలివారి మాటల్లో ప్రేమాన్వితమైన సాధికారకత కనిపిస్తుంది.

చిన్నపిల్లాడు రోడ్డుపై పడ్డాడనుకోండి. ఏమవుతుంది. మోకాళ్ళు గీసుకుపోయాయి. రక్తం కారుతోంది. బాధతో విలవిలలాడుతున్నాడు. దారినపోతున్న పెద్దాయన పిల్లాడిని చూశాడు. అయ్యో పాపం అనిపించింది. పిల్లాడ్ని దగ్గరకి తీసుకొని 'ఏడవకురా! పెద్దగా తగల్లేదు దెబ్బలు మందురాసుకో తగ్గిపోతుంది' అని సముదాయించాడు. అయినా, పిల్లాడి

ఏడుపుమానలేదు.

పిల్లాడుపడిన సంగతి తెలిసి, తల్లిదండ్రులు ఆదరాభాదరా పరుగెత్తుకు వచ్చారు. 'అయ్యో' అయ్యో ఎలా పడ్డావురా కన్న– అంటూ పిల్లాడిని దగ్గరకి తీసుకొన్నారు. ప్రేమతో తల నిమిరారు. దెబ్బ తగలిన చోట చెత్తో మట్టి తుడిచారు. 'ఏడవకురా నాన్న! మందేస్తానుగా తగ్గిపోతుందిలే' అన్నారు. అమ్మనాన్న మాట టానిక్‌లా పనిచేసింది. ఎంతైనా అమ్మ! నాన్న! వాళ్ళపై గురి అటువంటిది. నా ఆలనాపాలనా చూస్తారన్న నమ్మకం గొప్పదిమరి. ఈ భావన రోడ్డున వెళ్ళేపెద్దాయన చెపితే, కలుగుతుందా? చెప్పండి మీరే?

మండలివారితో మాట్లాడుతుంటే, మనకు ఇటువంటి భావనే కలుగుతుంది.

ఆ భావన, ఫలనా రకంగా వుంటుందని మాటల్లో చెప్పలేము. మండలివారితో మన సంభాషణలను ఎన్నిసార్లు గుర్తుచేసుకొన్నా మాటలకందని మధుర భావన కలుగుతుంది. మండలివారి మాటల్లో ప్రేమ తొణికిసలాడుతుంది.

వో సాధికారత దర్శనమిస్తుంది.

మనకిలాంటి ప్రేమ, సాధికారత, అమ్మనాన్నల లాలనలో కన్పిస్తాయి.

మండలివారి మాటల శక్తి అమోఘం.

అద్భుతం.

మన ఆలోచనాధోరణిని మార్చేస్తాయి. అందుకనే వాళ్ళమాటల్ని మనస్ఫూర్తిగా నమ్ముతాము.

ఐతే, గమ్మత్తు ఏమిటీ అంటే, వాళ్ళ ఎదురుగా కూర్చొన్నప్పుడు, వాళ్ల మాటలకి గొప్పశక్తి వుందని అనిపించదు. ఏదో మామూలు మాటలే వింటున్నామనుకొంటాము.

ముక్తాయింపు చెప్పేముందు వొక్కమాట.

మండలితో కొన్ని రోజులయినా వున్న వాళ్లకి, నా ఈ కథలు పాత తీపి గుర్తులని స్మరణకి తెస్తాయి.

ఆ అదృష్టంలేనివారికి, ఈ కథలవల్ల మండలివారి ప్రేమ సువాసనలు కొంచెంగానైనా లభిస్తాయి.

మండలివారితో కలిసి వుండటమంటే ఏమిటో వూహిస్తారు. అలానే బాబావారి పట్ల మండలివారి ప్రేమారాధన, మండలిపై బాబావారి ప్రేమ ఎంతగొప్పదో అంచనా వేస్తారు.

ఈ ఆలోచనల్లోనే కొత్తశక్తి వస్తుంది.

ఏమంటారు? ●





# ఎవరీ హైదరాబాదీ....

**అ**వతారుని ప్రేమలీలలు మాటల్లో అభివర్ణించలేం.

ఒక్కొక్కరి అనుభూతి ఒక్కోరీతిలో వుంటుందని బాబా ప్రేమికులకు అనుభవం.

అలాగ, ఒక బాబా ప్రేమికుని –యదార్ధ వాస్తవ విషయం ఇది.

**ఆ బాబా ప్రేమికుని పేరు తెలియదు.**

ఆయన హైదరాబాద్‌లో పనిచేసిన ఒక ప్రభుత్వ ఉన్నతోద్యోగి.

శ్రీ నిట్టా భీమశంకరం ఆయన సమకాలీకులు.

శ్రీ నిట్టావారు బాబా ప్రేమలీలను వర్ణిస్తూ ఎన్నింటినో గ్రంధస్థం చేశారు. శ్రీ నిట్టావారి సంకలనాల్లోని ఒక యదార్ధ వాస్తవ విషయమే **ఈ – ఎవరీ హైదరాబాదీ....**

దయచేసి పరిశీలించండి. స్పందించండి. ఈ శీర్షిక చదివాక, హైదరాబాద్‌లో వుంటున్నవారికి, ఈ వ్యాసంలో పేర్కొన్న బాబా ప్రేమికుని గురించి ఏ మాత్రమైనా తెలిసివుంటే, ఎడిటర్, మెహెర్‌బాబా మాసపత్రికవారికి మీ అభిప్రాయాన్ని వెంటనే పంపండి. పాఠకులందరితో పాలుపంచుకుందాం. .....

**ఇక విషయానికి వస్తే ..**

ఆ బాబా ప్రేమికుడు తన కుమార్తె వివాహం తలపెట్టాడు. పెళ్ళి ముహూర్తం కూడా నిశ్చయమయింది. 1969 మే 31 వ తేదిన పెళ్ళి.

ఐతే, మే 24, 25 తేదీలలో పూనేలోని గురుప్రసాద్‌లో బాబా దర్శనమిస్తున్నారు. ఆ దర్శన కార్యక్రమానికి వెళ్ళడానికి ఆయనగారు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు.

పెళ్ళి ఖర్చులకోసం తగిన డబ్బు సర్దుబాటుచేసుకోవాలి. పెళ్ళి పనులు చేపట్టడానికి చేతిలో బొత్తిగా తైలం లేదు. పెళ్ళిరోజు దగ్గరపడుతోంది. డబ్బు సర్దుబాటుకోసం ఆయన చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు.

ఆదుకుంటారనుకున్నవాళ్ళెవరూ కలిసి రాలేదు.

**మాది మాకిస్తే మడిమాన్యాలిచ్చినట్లు** ..... అనుకున్నది అనుకున్నట్లు ఏదీ ఆయనికి సానుకూలపడలేదు.

మనస్సులో బెంగగా వుంది.

ఇదిలావుంటే, ఒకరోజున ఏదో పనిమీద మారేడుపల్లి వెళ్ళాలని ఆటో ఎక్కాడాయన. ఆటోలో కూర్చున్నా ఆయన మనస్సు మనస్సులో లేదు. ఏదో పరధ్యానంగా వున్నాడు.

చాలా నీరసంగా వుంది. నిరాశ, నిస్పృహ ఆవహించినట్లుంది. తెగని ఆలోచనలతో సతమతమౌతున్నారు. ఆటోరిక్షా ట్యాంకుబండ్‌పై నుండి రాష్ట్రపతి రోడ్డుమీదుగా తిన్నగా మారేడుపల్లి వెళ్ళాలి. ఐతే, రాష్ట్రపతి రోడ్డు దగ్గర ఎడమవైపుకు తిరిగి జనరల్ బజారు కేసి ఆటో డ్రైవరు పోనిస్తుంటే – ఏమిటి ఇటు పోనిస్తున్నావ్ ?అని డ్రైవరుతో అంటే – మీరే కదా సార్, – **లెఫ్ట్‌కేసి పోనీ** అన్నారన్నాడు.

దాంతో, సరేలే.. ఆ దారిలో వుంటున్న తన మిత్రుని ఇంటికి ఎంతోకాలంగా వెళ్ళాలనుకుంటున్నా వీలుపడలేదనిచెప్పి, మహంకాళి వీదిలోవుంటున్న ఆతని ఇంటికి పోనిమ్మని తన స్నేహితుని ఇంటికి వెళ్ళాడు.

ఎంతోకాలం తర్వాత వచ్చిన స్నేహితుడ్ని చూసి అతను, ఆతని భార్య ఎంతో ప్రేమతో గౌరవించారు.

ఇతనివల్ల ఆ స్నేహితుని కుటుంబానికి ఆ మధ్యకాలంలో లక్ష రూపాయల లాభం వచ్చింది. ఆ కృతజ్ఞతతో ఆ మిత్రుని కుటుంబం వుంది.

కుశల ప్రశ్నలయినాక, తన కుమార్తె వివాహానికి మే 31న తప్పక రావాలని ఆహ్వానించాడు.

అలా చూడండని, గోడకు తగిలించిన శుభలేఖను చూపిస్తూ – మరచిపోతామేమోనని, మాకు రోజూ మీ శుభలేఖ కనిపించేలా ఎదురుగా ఉంచుకున్నామని – ఆ దంపతులిద్దరూ ఏ మాత్రం తడుముకోకుండా అన్నారు.

అవును.. శుభలేఖ అందిందనుకోండి.. అయినా స్వయంగా పిలుద్దామని వచ్చానన్నాడు.

తప్పకుండా వస్తామంటూ.... మీరేంటి, అంత నీరసంగా కనిపిస్తున్నారు. ఆరోగ్యం ఎలావుందని వాకబు చేశారు.

ఏం చెప్పమంటారు.

ముహూర్తం వారం రోజులుంది.

చేతిలో ఏమీలేదు. పెద్ద బరువు తలమీద వుంది. శుభకార్యం ఎలా జరుగుతుందో తెలియదు... అని ముక్తసరిగా అన్నారాయన.

రెండ్రోజులు ముందుగా చెప్పివుండాల్సింది. అయినా నేను నా ప్రయత్నం తప్పక చేస్తాను. తగిన సహాయం అందిస్తాను అని హామీ ఇచ్చాడా మిత్రుడు.

మంచిది అని సెలవు తీసుకుని తన దారిన మారేడుపల్లికి బయలుదేరాడు.

ఇంటికి వచ్చి పూనేకు ప్రయాణమయ్యాడు. పూనేకుబయలుదేరేముందు శుభలేఖలు పోస్టుకెళ్ళాయా అని వాకబు చేస్తే, ఇంకాలేదన్నారు. ఐతే, తొలి శుభలేఖ ప్రతిని బాబా పాదాల దగ్గర ఉంచుతాను. నేను పూనే వెళ్ళిన తరవాత, 25వ తేది సాయంత్రం ఇక్కడ పోస్టులో వేయండని, ఆ పనిని తన కుమార్తెకు పురమాయించాడు. అలాగే, తన స్నేహితుడు





డబ్బు తీసుకువచ్చి ఇస్తే దాన్ని మగ పెళ్ళివారికి పంపమని చెప్పి, భార్యా సమేతంగా రైలెక్కాడు.బాబా దర్శనం బాగా జరిగింది. శుభలేఖలను బాబా పాదాలచెంత వుంచాడు.

బాబా పాదాలు తాకి కళ్ళకు అద్దుకునే సమయంలో, తన కుడిచేతిలో ఒక గులాబీ రేక పడింది. అది బాబావారి ప్రసాదంగా భావించాడు. ఆనందంతో ఉప్పొంగిపోయాడు. దాంతో కొండంత బలం వచ్చినట్లు భావించాడు.

బాబా తనకు అండగా నిలుస్తారని ఆనందపడ్డాడు.

పూనాలో బాబా దర్శనం చేసుకుంటున్న సమయంలోనే మహంకాళి వీధిలోని మిత్రుడువచ్చి ఐదువేలు ఇంట్లో ఇచ్చాడు.

దాన్ని మగ పెళ్ళివారికి ఇవ్వాల్సిన కానుకలకై పంపారు.

ఇక మిగిలిన ఖర్చులకోసం ఓ రెండువేలు (ఇవి ఆనాటి లెఖ్ఖలు) సర్దుకోవాలనుకున్నాడు. తనకు గవర్నమెంటునుండి కొంత నగదు రావాలి.

అక్కడ ఆ అధికారి రేపుమాపు అంటూ ఏవో అడ్డంకులు పెడుతున్నాడు.

తాను పూనేనుంచి వచ్చేసరికి ఆ అధికారికి బదిలీఅయి, తనకు రావల్సిన నగదు శాంక్షనయింది. ఇంతలో మరో స్నేహితుడు మరోరకంగా ఆదుకున్నాడు.

ఆ రోజుల్లో హైదరాబాద్‌లో తెలంగాణా ఆందోళన ఉధృతంగా జరుగుతోంది.

పెళ్ళిలో దుండగులు గడబిడచేస్తారేమోనని భయపడ్డాడాయన.

ఐతే, శుభలేఖ ఇవ్వాలని పెద్ద పోలీసు ఆఫీసరైన తన స్నేహితుడొకని దగ్గరకెళ్తే, తానుగా పెళ్ళికి రాలేక పోయినా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేస్తానన్నాడు.

అదే ప్రకారం పోలీసులు పెళ్ళిపందిరికి దూరంగావుండి, తగిన రక్షణ కల్పించారు.

ఏ అల్లరి జరగలేదు. పెళ్ళి వైభవంగా జరిగింది.

ఈ పెళ్ళికి నిట్టా భీమశంకరం కూడా హాజరయ్యారట.

నేనూ ఆ పెళ్ళి వైభవాన్ని తిలకించి ఆనందించానని ఆయన అన్నారు. అయితే, పెళ్ళి అంతాఅయినాక ఇంత చరిత్రవుందని తెల్సిందంటారాయన.

ప్రియతమ బాబా తన ప్రేమికులకు ఐహికంగా ఏ ఇబ్బంది వచ్చినా, అది చిన్నదైనా, పెద్దదైనా అభయం ఇచ్చి కంటికి రెప్పలాగా కాపాడతారు.

ఈ శీర్షిక, ఈ ఉదంతం అదే తేటతెల్లం చేస్తోంది.

మీరేమంటారు??

**ఆ పెద్దాయన ఎవరో తెలిస్తే మరచిపోకండి. వివరాలు పంపండి.** ●

# మీకు తెలుసా???

**మె**హెర్‌బాబా 1952 నవంబరులో తొలిసారిగా హమీర్‌పూర్ జిల్లాలో పర్యటించారు.

మహేవా అనే గ్రామంలో బాబా ప్రేమికుడైన కేశవనారాయణ నిగమ్ ఇంట బాబా బస చేశారు. కేశవనారాయణ నిగమ్ బాబా కోసం ప్రత్యేకంగా తన ఇంటికి సమీపంలో చిన్న కుటీరం ఏర్పాటుచేశాడు.

ఆ సమయంలో కేశవనారాయణ్ నిగం భార్య యొక్క చెల్లెలు అనారోగ్యంతో వుంది. ఆమెక్కూడా బాబా దర్శనం చేసుకోవాలనే కోర్కె బలంగా వుంది. తన అక్కగారితో – బాబా దర్శనం ఎలాగైనా ఇప్పించమని, తానిక ఎక్కువ రోజులు బ్రతకనని, బాబా దర్శనం అయినాక తన ప్రాణంపోయినా ఫరవాలేదని ప్రాధేయపడుతుంది. ఐతే, ఆమెగా బాబా దర్శనం చేసుకునే స్థితిలో లేదు. మంచంమీద నుండి లేవలేని స్థితిలో వుందామె. బాబానే స్వయంగా ఆయనంతట ఆయనగా రావాలి. నిగమ్ కూడా బాబా దగ్గరకెళ్ళి ఆమెను వచ్చి చూడమని అడిగే ధైర్యం లేదు.

ఆ మర్నాడు బాబా కుటీరం బయట నిగం కాపలాగా డ్యూటీలో వున్నాడు.

నిగం భార్య పరుగున వచ్చి తన చెల్లెలు అదోలా చూస్తోంది. ప్రాణం పోయినట్లు కదలడం లేదు, మెదలడం లేదు. పిలిచినా పలకడం లేదు. చనిపోయిందేమోనని భయంగా వుంది. నీవు వొకసారి చూద్దువు రా.. అని తన భర్తను పిలిచింది.

ఐతే, నిగం.. తాను బాబా దగ్గర కాపలా డ్యూటీలో వున్నానుగాన, ప్రస్తుతం కుదరదని నచ్చచెప్పబోయాడు. బాబా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనకు డిస్టర్‌బెన్సు కలగకుండా వెళ్ళిపొమ్మనమని ఆమెతో శ్రీ నిగం అంటుండగా, బాబా తన కుటీరంలోంచి చప్పట్లుకొట్టి నిగంను పిలిచారు.

నిగం లోనికి వెళ్ళాడు. బాబా ఏమిటని అడిగితే...... ఏమీలేదని నీళ్ళు నములుతాడు.

ఏమీ సంకోచించక, ఏమిటో చెప్పమని బాబా తిరిగి అన్నారు.

దాంతో, జరిగిన సంగతంతా బాబాతో సవివరంగా నిగం చెప్పాడు.

బాబా తక్షణం వేగంగా ఈవతలకి వచ్చి నిగం ఇంటికి వెళ్ళారు.

నిగం కూడా బాబాను అనుసరించాడు.

అయితే, అప్పటికే ఆమె మరణించింది.

నిగం భార్య కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది.

బాబా ఆమెను ఏడుపెందుకని వారించారు.





ఏడుపెందుకు.... నీ చెల్లెలు చనిపోయిందనా అని బాబా ఆమెను ప్రశ్నించారు. మరణం అందరికీ తప్పదని బాబా ఆమెను సముదాయించారు. విచారించవద్దని ధైర్యం చెప్పారు. ఆ చనిపోయిన మృత శరీరాన్ని బాబా తన చేతులతో స్పృశించారు. దిగులు పడొద్దని చెప్పి బాబా తన కుటీరంకేసి వెళ్ళారు.

ఆయన వెనుకనే నిగం కూడా వెళ్ళిపోయాడు.

బాబా కుటీరాన్ని చేరారో లేదో, నిగం భార్య ఆనందంతో బాబా కుటీరానికి వచ్చి బాబావారి పాదాలపైపడి .......చనిపోయిన నా చెల్లెలు మరల బ్రతికించారు.. నా చెల్లెలుకు పునర్జన్మ ఇచ్చారని, ఆమె ఎంతో ధన్యురాలని బాబా ఎదుట తన ఆనందాన్ని కృతజ్ఞతలతో ఆమె వెల్లడించింది.

బాబా ఆమెను దీవించి పంపారు.

తెలుగువారు చాలామంది ఇటీవల హమీర్‌పూర్ వెళ్ళివస్తున్నారు.

కేశవ నారాయణ్ నిగం గురించి వినే వున్నారు.

మహేవా గ్రామం సందర్శించారు.

ఈ విషయం కూడా చాలామంది బాబా ప్రేమికులకు తెలిసేవుంటుంది.

ఈ దఫా హమీర్‌పూర్ వెళ్తే, ఈ విషయమై మరింత సమాచారం సేకరించండి..

ఇదంతా అవతారుని ప్రేమలీలలు కాక మరేమిటి????

# పూతికపేట సెంటరు

### ఇకపై బాబా ప్రేమికులకు అంకితం

విజయనగరం జిల్లా పూతికపేట సెంటరు 20వ వార్షికోత్సవాన్ని 1-5-2009 ఘనంగా జరుపుకున్నారు. నెల్లిమర్ల-మొయిదా జంక్షన్‌లకు సమపంలోగల పూతికపేట గ్రామంలో స్థానిక బాబా ప్రేమికుడు **శ్రీ అశిరప్పడు** కొంత స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఆ స్థలంలో అశిరప్పడుగారే తన సొంత ఖర్చులతో బాబావారి ప్రార్థనా భవనాన్ని నిర్మించారు. కాగా, మే 1న, సెంటరు 20వ వార్షికోత్సవాన్ని వేడుకగా జరుపుకుంటూ, పూతికపేట సెంటరును ఇకపై బాబా ప్రేమికులందరికిచెందేలా స్థానికులకు అంకితమిస్తున్నట్లు శ్రీ అశిరప్పడు ప్రకటించారు.

అనంతరం జరిగిన ప్రేమిక సహవాస్‌లో విజయనగరం నుంచి శ్రీ అఘోరపతి, శ్రీ సి.వై.చింతామణి, శ్రీ సన్యాసిరాజు (విశాఖ), శ్రీ జి. క్రిష్ణంనాయుడు (పాలకొండ) తదితరులు బాబావారి సందేశాలను వివరించారు. ముందుగా, శ్రీ కె.వి.రత్నం (విశాఖ) బాబావారి సప్తవర్ణ పతాకాన్ని ఎగురవేశారు. శ్రీ రత్నం అవతారుని చిత్రపటాన్ని పూతికపేట సెంటరుకు బహుకరించారు.

# ఎండాకాలంలో చల్లని నీడలా....

**ఎడారిలో ఎండమావిలా.....**మెహెరాబాద్‌లో ఆంధ్రా రెస్టు హౌసు మార్చి 15 నుండి బాబా ప్రేమికులెందరికో చక్కని చల్లని వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తోంది.

గత సంవత్సరందాకా మార్చి 15 నుండి మే 25 దాకా మెహెరాబాద్‌లో ఎలాంటి వసతి సౌకర్యం దొరికేదికాదు. ఈ సమయంలో మెహెరాబాద్‌లోని అన్ని హాస్టల్సు మూసివేస్తారు.

వేసవి సెలవలు కదా, నాల్గు రోజులు బాబా సమాధి దగ్గర గడుపుదామని దూర ప్రాంతాలవారు ఎవరైనా బాబా సమాధి దర్శనార్ధమై వస్తే, వారికి తగిన వసతి, భోజనాలు దొరకక నానాయాతన అనుభవించాల్సి వచ్చేది.

నేడా సమస్య లేదు.

ఆంధ్రారెస్టు హౌసు నిర్మాణంతో ఆ సమస్యలు నేడు సంపూర్ణంగా మటుమాయమయ్యాయి.

తద్వారా బాబా ప్రేమికులు ఏడాది పొడుగూతా ఎవరి వీలునుబట్టి వారు మెహెరుని సన్నిధికి వెళ్ళగల్గే అవకాశం ఆంధ్రా రెస్టుహౌసు బాబా ప్రేమికులకు కల్పిస్తోంది. ఈ విషయమై ముఖ్యంగా, రెస్టుహౌసు ఏర్పాటులో ఇతోధికంగా శ్రమించిన ప్రియతమ బాబా ప్రేమికులు శ్రీ వై.యస్.రావు ప్రత్యేకించి అభినందనీయులు.

ప్రస్తుతం ఆంధ్రారెస్టు హౌసులో ఫస్టు ఫ్లోర్ నిర్మాణం పూర్తయింది. తద్వారా సుమారు 50 మందికి భోజన, వసతి, సౌకర్యం కల్పిస్తున్నారు. ఇందుకోసం ఒక్కొక్కని నుండి రోజుకు రూ.60 వసూలు చేస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 15 నుంచి 20 మంది బాబా ప్రేమికులు ఈ వేసవిలో విడిది చేస్తున్నారని సమాచార భోగట్టా.

ఇదిఇలావుండగా, చేపట్టిన రెండవ అంతస్థు నిర్మాణం పూర్తయితే, సుమారు నూరుమందికి పైగా వసతి కల్పించే అవకాశం వుంటుంది. ఫస్టు ఫ్లోర్ నిర్మాణం వరకూ, రూ. 36.62 లక్షలు ఖర్చు అయ్యింది. (స్థలం ఖరీదుతో కల్పి).

విరాళాల రూపంలో ముట్టినది. రూ. 23.92 లక్షలు. కాగా అప్పుగా రూ. 12.70 లక్షలు చెల్లించాల్సివుందని కార్యదర్శి, ఆంధ్రారెస్టుహౌసు, శ్రీ వై.యస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు.

30 మందికి పైగా రూ.25 వేలు చెల్లించి జీవిత సభ్యులయ్యారని ఆయన అన్నారు. రెస్టు హౌసుకు మంచి నీటి సౌకర్యం బాబా ట్రస్టు కలగజేసిందని, అందుకు బాబా ట్రస్టు చైర్మన్, ఇతర ట్రస్టీలందరికీ కృతజ్ఞతలు శ్రీ వై.యస్. రావు తెలియజేశారు.

బాబా ప్రేమికులందరి కోసం, ముఖ్యంగా తెలుగువారికి ప్రత్యేక వసతి సౌకర్యకల్పనకై చేపట్టిన ఈ నిర్మాణానికి ఆంధ్రులు తగిన సహాయ సహకారాలు అందించాలి. రెండవ అంతస్థు కూడా వచ్చే ఏడాది మార్చిమాసానికి సిద్ధమయ్యేలా తగిన ఆర్థిక సహాయం అందించి ప్రతి ఒక్కరూ తమ భాగస్వాములుకావాలని శ్రీ వై.యస్.రావు బాబా ప్రేమికులందరికీ విజ్ఞప్తి చేశారు.

**జూలై 10 దాకా...**ఆంధ్రారెస్టు హౌసు జూలై 10 దాకా బాబా ప్రేమికులకు అందుబాటులో వుంటుంది. మే 15 నుండి మెహెరాబాద్‌లో పలు హాస్టల్సు పునప్రారంభిస్తున్న దృష్ట్యా, ప్రేమికుల విజ్ఞప్తిని అనుసరించి రెస్టు హౌసులో బస ఏర్పాట్లు కొనసాగించగలమని శ్రీ రావు తెలిపారు.

### వంటవాళ్ళు కావాలి

ఆంధ్రారెస్టు హౌసులో పనిచేసేందుకు ఇష్టమున్న వంటవాళ్ళు, వాచ్‌మెన్ తమ వివరాలను శ్రీ వై.యస్.రావుకు తక్షణం అందేలా పంపుకోవాలని శ్రీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికయినవారికి ఉచిత భోజన,బస వసతి సౌకర్యాలతోపాటు అర్హతనుబట్టి నెలసరి జీతంకూడా చెల్లిస్తామని ఆయనన్నారు.

### 500 చ.గజాలు స్థలం అమ్మకానికి

ఆంధ్రా రెస్టు హౌసుకు సమీపంలో సుమారు 500 చ.గజాలు స్థలం, రిజిస్ట్రేషను చార్జీలతోకల్పి మొత్తం ఖరీదు రూ.6 లక్షలుకు తక్షణం అమ్మకానికి సిద్ధంగావుంది. వంద గజాలకు తక్కువకాకుండా కూడా అమ్మగలనున్నారు. మరిన్ని వివరాలకు శ్రీ వై.యస్.రావు 09848111671/ 09011751910 లను సంప్రదించగలరు.

# వివాహం

చి॥ ప్రసాద్ వివాహం చి॥ల॥సౌ॥ రమాదేవితో టి.టి.డి. కళ్యాణ మండపము, నార్పల గ్రామము, అనంతపురం జిల్లాలో 15.05.2009, శుక్రవారం జరుపుతున్నట్లు శ్రీమతి గాండ్ల రుక్మిణమ్మ ఆహ్వానం పంపారు.

# వివాహం

చి॥ల॥సౌ॥ సౌజన్య వివాహం చి॥ సందీప్‌తో నవీన్‌చంద్ర కళ్యాణ మండపము, ఆర్.యస్.రోడ్, రాజంపేట, కడపజిల్లాలో 20.05.2009, బుధవారం జరుపుతున్నట్లు శ్రీమతి గాండ్ల పుణ్యవతి, శ్రీ గాండ్ల చిన్నయ్య దంపతులు ఆహ్వానం పంపారు.

మెహెర్‌బాబా మే 2009



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

**న**వంబరు 23వ తేదీ నుంచి బాబావారు స్కూలు పిల్లలకి ఆధ్యాత్మిక విషయాలు చెప్తున్నారు. బాబా పాఠాలు ఎంతగా ఆసక్తికరంగా వున్నాయంటే పిల్లలకి బోర్కర్, అంగలప్లీడర్ చెప్పే పాఠాలు నచ్చటంలేదు. సాయంత్రంకాగానే బిలబిలా గొయ్యిగదికి వచ్చేవారు. తూర్పుకిటికీ ప్రక్కనేవున్న ఎత్తైన అరుగుమీద కూర్చొనేవారు. వీళ్ళ ప్రక్కకి మండలివారు చేరేవారు. బాబావారు కిటికీ లోపలనుంచి, అందరూ తదేకంగా తమవైపే చూస్తుంటే, చిరునవ్వుతో పాఠాలు మొదలుపెట్టేవారు. ఏకబిగిన రెండుగంటలు నడిచేదిక్లాసు. మౌనమూర్తి పాఠాలు ఎలా చెప్పేవారని ఆశ్చర్యపడుతున్నారా? అయితే వినండి. అక్షరఫలకంపై బాబావారి వ్రేళ్ళు వేగంగా కదులుతుంటే, పిల్లలు వొకో అక్షరాన్ని కూడబలుక్కుని చదివేవారు. వాళ్ళకి మరోధ్యాస వుంటే వొట్టు. వాళ్ళ దృష్టి అంతా అక్షరఫలకంపైనే. బాబామాటలపైనే. బాబావారు వొకోసారి అక్షరఫలకాన్ని ప్రక్కకుపెట్టి చెప్పదలిచిన సంగతిని సంజ్ఞలద్వారా తెలియజేసేవారు.

వేదాంతులనే తికమకపెట్తాయి ఆధ్యాత్మిక సంగతులు. చదువుకొన్నవారికి సహితం వోపట్టాన అర్ధంకావు, మరి అభంశుభం తెలియని పిల్లలు సంగతేమిటి మహాప్రభు? అని అడుగుతున్నారా, అయితే వినండి.

బాబా చెప్పేపద్దతిలో కొత్తదనంవుంది. ఆయన చెప్పేది పిల్లలకి కదా. వాళ్ళకి అర్థమయ్యేలాగా వివరించేవారు. అది ఏలాగన అంటే, సృష్టి క్రమాన్ని వివరించాలనుకోండి. రబ్బరు బొమ్మని తెప్పించేవారు. దాన్ని రకరకాల భంగిమల్లో చూపిస్తూ సృష్టి పరిణామదశ గురించి చెప్పేవారు. అలానే సంస్కారాల దశ గురించి చెప్పాల్సివస్తే, అద్దం తెప్పించేవారు. అద్దంలో కనిపించే బింబం మన ప్రతిబింబమే కానీ, నిజమైన బింబం కాదు కదా! ఇలా సందర్భాన్ని బట్టి వోకో ఉదాహరణ చెప్పేవారు. ఉపమానం వాడేవారు. అందుకనే బాబా ఉవాచ పిల్లల గుండెలోతుల్లోకి చొచ్చుకుపోయి, మనుస్సుని తట్టి లేపింది. బాబా సమక్షంలో వాళ్లకి టైమ్ తెలిసేదికాదు. బాబా ఏకబిగిన రెండు గంటలు మాట్లాడినా, 'అబ్బ, ఇంతత్వరగా అయిపోయిందా ఈవాల్టి పాఠం' అనిపించేది.



ఇంతకూ బాబావారు ఏ విషయాలు చేప్పేవారని అనుకొంటున్నారు. ఈ వివరాలు చెపితే, 'ఎంత అదృష్టవంతులో ఆ పిల్లలు', అని మీకు అనిపిస్తుంది.

సృష్టి ఎందుకోసం, రెండరకాల పరిణామక్రమ దశలు- ఒకటి పరమాత్మవరకూ చేరే ఆరోహణక్రమం, రెండవది పరాత్పార పరబ్రహ్మ స్థితినుంచి నేనెవరో తెలుసుకోవాలను తపనతో మొదలయిన పరిణామక్రమం, సూక్ష్మ, మానసిక భూమికలు, సూర్యచంద్రులు, (మనకు కనిపించేది ఒక్కసూర్యుడు, ఒక్క చంద్రుడు, కానీ ఎందరో చంద్రులు, మరెందరో సూర్యులు వున్నారు) గ్రహాలు, మరణానంతరంగల స్థితులు అంటే స్వర్గం, నరకం, వంటి అనేక విషయాలను చెప్పేవారు. వాయువు, రాయి, లోహం, వృక్షం, పురుగు, చేప, పక్షి, జంతువు, మనిషి దశల ఆవిర్భావం గురించి యోగులు, ఋషులు, గురువులు, అవతారుడిగురించీ, భగవదోన్మత్తత గురించి, మస్తులగురించి, దైవీప్రేమ, భక్తి గురించీ వివరించారు. ఇంకా మరెన్నో ఆధ్యాత్మిక రహస్యాలని పిల్లలకి అర్థమయ్యేలాగా చెప్పి, వాళ్ళ హృదయకవాటం తెరుచుకొనేలా చేసారు. ఇందువల్ల పిల్లలు దైవీ ప్రేమోన్మత్తులు అయ్యారు. ఆనందంతో వాళ్ళు గెంతులు వేస్తుంటే, ఏమిటీ, పిల్లలు పిచ్చివాళ్ళలా చేస్తున్నారేమిటి అని చూసేవాళ్ళు ముక్కున వేలు వ్రేసుకోసాగారు.

బాబా పాదాలముందు బోర్కర్, అంగల్‌ప్లీడర్ల పాఠాలు ఎంత? వాటిలో పిల్లలకి పస కనపడలేదు. వినాలిపించలేదు. పిల్లలకి క్లాసులో పాఠాలపై శ్రద్ధ తగ్గింది. బాబా దగ్గరవుండాలి. బాబా మాటలపైనే మనస్సుంచాలన్న తపన పెరిగింది. పిల్లలకి ఇప్పుడు బాబా నామస్మరణ చేస్తూ కూర్చోవాలనిపిస్తోంది. ధ్యానంచేయాలనిపిస్తోంది. టైమ్‌కి భోజనం చేస్తున్నారనేకాని, ఆకలి తగ్గింది.

పిల్లలతీరే ఈ ప్రకారంగా వుంటే, మెహెరాబాద్‌లో వాతావరణం మరి ఎలా వుంటుంది. మెహెర్‌ప్రేమ ప్రవహించింది. మెహెర్ సూధామృతధార సేవించి తన్మయులయ్యారు అందరూ పిల్లలు బాబావారికి బాగా దగ్గరయ్యారు.

డిసెంబరు 18వ తేదీన పాఠం చెప్తూ, బాబావారు వో బొమ్మని తెప్పించారు. బొమ్మఎందుకో తెలుసా? పరిణామక్రమం వివరించడానికట. బొమ్మ కాళ్ళు, చేతులు ముడుస్తూ, బొమ్మని మధ్యకివంచుతూ, పరిణామక్రమం ఏదో ఆషామాషీ వ్యవహారంగా బాబా చెప్పారు. అర్థమయిందని పిల్లలు తలవూపితే, ఎంతో క్లిష్టమైన విషయాన్ని బాబావారు ఎంత తేలికగా వివరించారని పెద్దలు అనుకొన్నారు.

బాబా బొమ్మను ముడిచేరు. కాళ్ళు చేతులు కనబడకుండా పోయాయి. బొమ్మని మధ్యకువంచారు. దాంతో బొమ్మతల క్రిందకి వంగింది. "చూశారా! ప్రాణంలేనివి ఇలానే వుంటాయి". అన్నారు బాబా. రాళ్ళు, శిలలు, లోహాలు మొదలైనవి బొమ్మవంటివే. వాటిలో ప్రాణం వుంది. కానీ బొమ్మలా ఇవి ముడుచుకుపోవడంతో వాటిలోని జీవం కళ్ళకి కనబడదు.

ముడిచిన కాళ్ళని, చేతులనీ విడదీశారు. కాళ్ళని ఆకాశంకేసి ఎత్తిపట్టి ఇంకోసంగతిచెప్పారు. కాళ్ళు ఎత్తిపెడితే అంటే బొమ్మని తల క్రిందులుగా చేసినప్పుడు బొమ్మనోరు ఎక్కడుంది.? నేలపై వుంది. అవునా. ఇదే చెట్టు దశలోని ఆత్మస్థితి. నోరు వ్రేళ్ళదగ్గరవుంటే, కొమ్మలు పైనవున్నాయి. ఆకాశంకేసి చూస్తున్నాయి." అని బాబా అన్నారు.

కాళ్ళు, చేతులపై బొమ్మని నిలబెట్టారు. అంతే బొమ్మ నాలుగు కాళ్ళ జంతువు అయింది. రెండుకాళ్ళపై బొమ్మని నిలిపారు. అంటే అది నిటారుగానిలబడింది. "ఇదీ అఖరిదశ. అతి ఉత్కృష్టమైన మానవదశ", అని మరో కొత్త విషయాన్ని పిల్లలకి చెప్పారు.

సంస్కారాలని బాబా అద్దంతో పోల్చారు. అద్దంలో చూసుకుంటే మన రూపం మనకి కనిపిస్తుంది. మనం అద్దం పట్టుకొంటే, అలాగే కనిపిస్తుంది మన ప్రతిబింబం. ఇంతేకదా! ఈ ఉదాహరణతో సంస్కారాల గురించి బాబా ఎంత చక్కగా చెప్పారో మీరే గమనించండి. కోటు జేబులో నుంచి అద్దం తీశారు. పిల్లలకి చూపించారు. "ఇదిగో ఈ అద్దం వుందే, ఇది సంస్కారాలకి ప్రతీక అనుకోండి. అచేతనంగా వుంటూనే స్మృహలో వున్న స్థితి చైతన్యం అనుకోండి. అపస్మారంగా వున్న మనస్సులో చైతన్యం తెస్తే ఏమవుతుంది? నిద్రాణంగా వున్న భగవత్ అంశని తట్టి లేపినట్లవుతుంది. నేనెవరో తెలుసుకోవాలన్న తపన పుడ్తుంది. అంతే, వెంటనే సంస్కారాలు కదుల్తాయి. ఇప్పటిదాకా ప్రక్కన పెట్టిన అద్దం వంటివి సంస్కారాలు. ఒకసారి వాటిలో కదిలికరాగానే, అవి కళ్ళకేసి బయలుదేరతాయి అని అంటూ బొమ్మ గీసి మరి వివరించారు.





ఈ కదలికవల్ల అద్దం రాయి అవుతుంది. మరో కదిలికలో చెట్టు, ఆకుగా మారుతుంది. ఆ తర్వాత పురుగవుతుంది. చేపగామారుతుంది. పక్షి అవుతుంది. జంతువుగా ఎదుగుతుంది. ఇలా చెట్టు, పురుగు, చేప, పక్షి, జంతువుల దశల్లో, అద్దం కళ్లకి కనిపిస్తుంది. రాయి దశలో అద్దం అంచుకనిపిస్తే చెట్టుగా మారిన అద్దం కొంచెం బాగా కనిపిస్తుంది. మరి పురుగుదశలో ఇంకొంచెం బాగా చూడవచ్చు అద్దాన్ని. ఇలా దశమారినకొద్దీ అద్దం మరింత ఎక్కువగా దర్శనమిస్తుంది. ఆఖరి దశ- అంటే మానవదశ చేరేసరికి, అద్దం పూర్తిగా కళ్లకు కనిపిస్తుంది. అద్దంలో మన పూర్తి రూపం చూడగలుగుతాము. ఇది ప్రతిబింబమే. అసలు రూపంకాదు. కానీ ఇదే నా రూపం అనుకొంటాము. ఇహపోతే మరోమాట పరిణామదశల్లో చైతన్యం అంతంత మాత్రంగా వున్నప్పుడు అద్దం ఏటవాలుగా కనిపిస్తుంది. మరి చైతన్యం పెరిగినకొద్దీ నిటారుగా మారుతుంది. మొత్తం అద్దం స్పష్టంగా కన్పించగానే, ఆత్మ ఏంచేయాలి? తన బింబం కేసి కళ్ళార్చి చూడకూడదు. అంతర్ముఖుడై తన నిజస్వరూపాన్ని తెలుసుకోవాలి. కానీ అలా చేయకుండా తన ప్రతిబంబాన్ని చూస్తుంది. ఈ ప్రతిబింబం నిజస్వరూపం కాదు కదా. అదొక భ్రాంతి, మాయ. మాయని చుస్తోంది ఆత్మ. మరి అద్దాన్ని తీసేయాలి. దాన్ని ముక్కలుముక్కలు చేసి, పొడిచేసేయాలి. అంటే సంస్కారాలని పూర్తిగా నాశనంచేయాలి. భ్రాంతిని సృష్టిస్తాయి సంస్కారాలు. వాటిని కనుక తుడిచిపెట్టక పోతే, అవి అలానే వుండిపోతాయి. జన్మ ఎత్తిన ప్రతిసారీ, నేనున్నానంటూ వెంట వస్తాయి. అది ఏలాగన అంటే, అన్ని ముక్కలు చేయకపోతే, అద్దం ఏమీకాదుకదా ఆత్మ ఎన్ని రూపాలు చెందినా, అద్దంలో చలనం రాదు. చెట్టుగా మారినా, పురుగుగా పుట్టినా, చేప అయినా, పక్షిగా వచ్చినా, జంతువుగా, మనిషిగా మారినా, అద్దం అలానే చెక్కు చెదరకుండా వుంటుంది. సంస్కారాలు తుడిచి పెట్టకపోతే, అద్దం మాదిరిగా సంస్కారాలు చెక్కు చెదరకుండా వెంటవస్తాయి. అందుకనే సంస్కారాలనే అద్దాన్ని తీసేయాలి. అప్పుడు ఆత్మకి నిజస్వరూపం తెలిసివస్తుంది." చూశారా! సంస్కారాలపై బాబా వివరణ ఎంత తేటతెల్లంగా వుందో, ఇలానే మరెన్నో సంగతుల్ని సులభంగా అర్థమయ్యేలా, గుర్తుండేలా చెప్పేరు.

పిల్లలికి బాబావారొక సంగతిని గుర్తుంచుకోమన్నారు. "నేను ఈ శరీరాన్ని కాదు, నేను ఆత్మని మాత్రమే. ఈ సంగతి మరచి పోవద్దన్నారు. నేనే ఈ శరీరాన్ని అన్న ఆలోచనవద్దు. అటువంటి అలోచనలు రాకుండా ప్రయత్నం చేయాలి. శరీరంలోని శక్తికి నేనే అన్న భావనా మానండి. నేనే మనస్సునన్న ఆలోచననీ ప్రక్కకు పెట్టండి. నేను ఆత్మను. నేనే జీవాత్మని అని అనుకోండి అని చెప్పారు.

బాబా చెప్పినట్లే పిల్లలు, శరీరం వేరు, ఆత్మవేరన్న సంగతిని గుర్తుంచుకునే ప్రయత్నం చేశారు. వోకుర్రాడయితే ఇదిగో శరీరమా! నువ్వు ఆత్మవికాదు, అని గట్టిగా అరిచేవాడు.

ఒకసారి బాబావారు వో చిక్కు ప్రశ్నవేశారు. మేఘాలకంటే ఎత్తయినదేమిటి? అడిగారు. పిల్లలు వొకరి మొహాలు వొకరు చూసుకొన్నారు. వీళ్ళకి జవాబు తెలియదని అర్థమయినబాబా, తామే చిక్కుముడి విప్పారు. మేఘాలకంటే ఎత్తయినది అమ్మ ప్రేమ. తమప్రేమ శిఖరాలు ఊహించలేనంత ఎత్తువన్నారు. ఇవి అనంతమైనవన్నారు.

పాఠం అయ్యాక, బాబా రోజూ ఒకేమాట చెప్పేవారు. నన్ను ప్రేమించండి. అప్పుడే నా గురించి తెలుసుకోగలుగుతారు  అనేవారు. మీ అందర్నీ వో వివేకానందుడిలా, స్వామి రామతీర్థలాగ, ఆలీగా, అర్జునుడిగా చేయాలనివుంది. నేను రెడీయే కానీ మీరు మూల్యం చెల్లించాలి.  మీ నుంచి నేను ఆశిస్తున్న మూల్యం ఏమిటో తెలుసా? కేవలం మీ ప్రేమ చాలునాకు.

తమ సాన్నిధ్యంలో రత్నాలు, వజ్రాలు, వైడూర్యాల వంటి అమూల్య సంపదగా మెహెరాబాద్‌లో దొరికే ఆధ్యాత్మికోన్నతిని బాబా పోల్చారు. ఇదొక అమూల్య సంపద పెట్టె. ఎందరో దోచుకుంటున్నారు. కానీ ఆ పెట్టె తెరవాలంటే ప్రత్యేక తాళంచెవి కావాలి. ఆ చెవి లేకపోతే సంపదపెట్టెని ఎత్తుకుపోయినా లాభం శూన్యం. గాఢమైన ప్రేమ వుంటే మెహెరాబాద్ ఆధ్యాత్మిక ఖజానా  పెట్టి తెరుచుకుంటుంది. ఈ ప్రేమ భగవత్ప్రేమ. ఆషామాషీ ప్రేమకాదు ఇది. నిజమైన ప్రేమ ఇది. ఈ ప్రేమతో పొందలేనిదీ ఏదీ లేదు. ఇంకో మాట. ఇక్కడ నేను వేలం పెట్టాను వో వస్తువుని. నేను వేలానికి పెట్టింది ఏమిటో తెలుసా? అది దైవిభక్తి. దీన్ని పాడుకోండి. మీకున్నదంతా పెట్టి పాడండి. చేజిక్కించుకోండి అని మళ్ళీ మళ్ళీ దొరకని మహద్భాగ్యం గురించి పిల్లలకి విడమరచి చెప్పారు.

బాబా ప్రవచనాలు ఆఘా ఆలీని బాగా ప్రభావితం చేసేయి. మెహెర్‌బాబా నా గురువు. ఆఘాఆలీ- మెహెర్‌బాబా కొడుకు. ఈ పుస్తకం సద్గురు మెహెర్‌బాబా వారి బానిసది, అని తన నోట్సు పుస్తకంలో వ్రాశాడు. బాబావారి వస్తువులని సేకరించి దాచిపెట్టేవాడు.

బాబా గోళ్ళు, బాబా జుట్టు, రాత్రిళ్ళు చెవిలో పెట్టుకొని ఉదయాన్ని పారేసేదూది- ఇలా అనేక వస్తువుల్ని దాచుకొనేవాడు. బాబా నామంతో ఆలీ మనస్సు నిండింది. బాబా నామం ఆలీ పెదవులపై ఎప్పుడూ కదిలింది. బాబా దివ్యప్రేమలో మునిగితేలాడు.





ఆఘా ఆలీకి మరో అలవాటు వుండేది. అది గులకరాళ్ళని రకరకాలుగా అమర్చడం. అక్షరమాలకూర్చడం. వాటిని చూస్తేచాలు ఆలీమనస్సు తెలిసేది. బాబావారిపట్ల అతనికున్న భక్తి ప్రపత్తులు వెల్లడి అయ్యేవి.

బాబావాడే వస్తువులు అంటే ఆలీకి ఎంతో ఇష్టం. బాబావాడిన వస్తువులంటే ఇహచెప్పనక్కర్లేదు. ఈ వస్తువులు బాబాని నిత్యం గుర్తు చేస్తాయనేవాడు. అందుకని బాబా వస్తువులని సేకరించి భద్రంగా దాచుకొనేవాడు. అతని బాబా ఖజానాలో చెప్పుకోదగ్గవస్తువు- బాబా గోళ్ళు, రాత్రినిద్రపోయేముందు బాబా చెవుల్లో దూది పెట్టుకొనేవారు ప్రొద్దుట నిద్రలేవగానే ఆ దూదిముక్కల్ని పారేసేవారు. ఇవొక అమూల్యవస్తువంటూ, ఆలీ, బాబా చెవి దూదిని దాచాడు భద్రంగా. ఇంకోలా చెప్పాలంటే, ఆలీ ఆత్మ తపిస్తోంది. హృదయం రోదిస్తోంది. పెదవులపై ప్రభుగానం కదలుతోంది. దైవీ ప్రియతముని ప్రేమ కోసం లాలనకోసం ఎదురు చూస్తోంది.

నవంబరు 25వ తేదీన బాబావారు భగవత్ప్రేమ గురించి ఆశ్రమం బాలురికి చెప్పారు.

భగవంతుడు ఎక్కడోలేడు. మీలోనే వున్నాడన్నారు. మీ మనస్సులో భగవంతుడుని గాలిస్తే దొరుకుతాడు అన్నారు. భగవంతుడి కోసం ఎక్కడ గాలిస్తారని ప్రశ్నించారు. ఆ చిన్నారులకి ఆ చిట్కాని కూడా తామే చెప్పారు. ప్రేమతో పిలుస్తే పలుకుతాడు భగవంతుడు అన్నారు. భగవంతునిపట్ల మీకు ప్రేమ కలగాలి మనస్సులో పుట్టాలి ప్రేమ. ఈ ప్రయత్నం చేయాలి మీరు అని చెప్పారు.

ఒకసారికనుక భగవద్వేషణ మార్గంలోపడితే చాలు గమ్యం నెమ్మదిన చేరుతాన్నారు.

భగవత్ప్రేమ గురించి మరింత విపులంగా చెప్తూ భగవత్ప్రేమ ఆకలి వంటిదన్నారు. ఆకలి వేస్తుంటే, అన్నం వెంటనే దొరకలేదనుకోండి. అప్పుడు ఏమవుతుంది. ఏదో అన్నం తింటున్న భావన కలుగదు. ఈ భావన, ఈ ఆలోచన - భగవంతుని కోసం నిత్యతపనవంటివన్నారు. ఇహపోతే, తిండి కోసం చేసే ప్రయత్నాలు? ఇవి భగవద్దర్శనంకోసం పడే తపన అని పేర్కొన్నారు. లాలించి గోరుముద్దలు తినిపించే తల్లి వంటి వ్యక్తి సద్గురువు. మరి భోజనం చేయటం భగవత్ దర్శనమే అన్నారు.

భోజనం ఎప్పుడు చేస్తారు? ఆకలి వేస్తేనే కదా! అలానే భగవత్ సాక్షాత్కారం కావాలంటే ముందుగా భగవత్ప్రేమ పెల్లుబుకాలి. ఆకలి వుంటే, తిండిపైకి మనస్సు పోతుంది. త్వరగా భోజనంచేయాలనిపిస్తుంది. ఇలానే దైవభక్తి, ప్రేమ కలుగగానే మనస్సు భగవంతునిపై లగ్నం అవుతుంది. దేవదేముడి గురించిన చింతనలోపడతారు.

ఆకలి తీరాలన్నా, భగవదైక్యం లభించాలన్న తపన అవసరం. ఆకలిమంటలు పిల్లాడిని అమ్మదగ్గరకి చేరుస్తాయి. అమ్మకనబడకపోతే, వండిపెట్టే వ్యక్తి కోసం వెతుకుతాడు. అలానే భగవదైక్యం కోసం తపన, మథన, సాధకుడిని గురువుదగ్గరకు చేరుస్తాయి. క్షుదార్తుడూ, సాధకుడూ, ఇద్దరూ కాలచక్ర భ్రమణంలో తమగమ్యం చేరుతారు.

అయితే, ఒక మాట. భగవంతుని పట్ల ప్రేమ ఎటువంటిదో చెప్పడానికే ఆకలిగురించి చెప్పాను. ఈ రెండూ అంటే, ఆకలి, ప్రేమ వొకేమోస్తరువికావు. ఆకలివేరు ప్రేమవేరు. ఆకలిని పుట్టించడం తేలిక మరి అంత తేలికగా ప్రేమ పుట్టదు. ఆకలివేస్తున్న కుర్రాడికి తల్లి త్వరగానే కనిపిస్తుంది. కానీ భగవద్దర్శనం కోసం పరితపిస్తూన్న సాధకుడికి గురువు అంత త్వరగా దొరకడు. ఇంతకూ భగవంతుని పట్ల ప్రేమ ఎలా పుట్టిస్తారు? ప్రేమ కోసం పరితపించే బదులు ప్రియతముని కోసం మీరక్తం ధారపోయండి. ఈ ఆత్మార్పణయే ప్రేమ. మహోత్కృష్టమైన ప్రేమయిది. మీలో ఎవరైనా ఇందుకు సిద్ధంగా వున్నారా? ఎవ్వరూ లేరూ? ఫరవాలేదు. బాధపడకండి. భగవంతుని ప్రేమించే ప్రయత్నం చేయండి అని బాబా ఆశ్రమ బాలురికి హితవు చెప్పారు.

హాఫీజు గురించి ప్రస్తావించారు. బాబా బాగా ఇష్టపడే కవి హాఫీజు. ఆయన కవితల సంకల్పం పేరు, **దివాన్ –ఇ–హాఫీజ్.**

సాహితీ ప్రపంచంలో హాఫీజు గొప్ప కవిగానే నలుగురికీ పరిచయం. కానీ హాఫీజు సద్గురువు. ఆనాటి కాలపు కుతుబ్ ఆయన. భారతదేశంలోనూ, పరిష్యాలోనూ హాఫీజు సూక్తులు చాలామందికి ఎందుకు చదువుతారో తెలుసా? దైవీ మార్గనిర్దేశనం కొరకు చదువుతారు.

సంక్లిష్ట సమయాల్లో దివాన్–ఇ–హాఫీజ్‌ని సంప్రదించాకనే నిర్ణయాలను తీసుకొన్న దృష్టాంతాలు ఎన్నో ఎన్నెన్నో, ఈ అలవాటు హాఫీజ్ సూక్తలను సంప్రదించి మార్గదర్శకత్వం పొందడం– ఇప్పటికీ వుంది. హాఫీజ్ మరణానంతరం, ఆయన భౌతికకాయాన్ని ఎక్కడ సమాధి వేయాలన్నది ప్రశ్న చిక్కుప్రశ్న అయింది. అప్పుడు కూడా ఆయన సూక్తుల గ్రంధాన్ని సంప్రదించారు. వెంటనే పరిష్కారమార్గం దొరికింది. కానీ, గమ్మత్తు ఏమంటే హాఫీజు కవిత్వంలో తొణికిసలాడే ఆధ్యాత్మిక రహస్యాలను చాలా తక్కువ మందికే అర్థమవుతాయి. అధ్యాత్మికతలోని దశలన్నింటిని హాఫీజ్ తమ 'దివాన్'లో చాలా స్పష్టంగా వివరించారు.

వొకొక్క ఆధ్యాత్మిక స్థితిని, గతిని వొక్కో ఘజల్ వివరిస్తుంది. అది అర్థంచేసుకోగల వారికి తెలుస్తుంది అని బాబా చెప్పారు.





నవంబరు 26వ తేదిన బాబా బాలురతో క్రికెట్టు కాసేపు ఆడారు. బెల్ కొట్టడంతో పిల్లలు క్లాసులకి వెళ్ళారు. కానీ బువాసాహెబ్, బోర్కరు క్లాసుకువెళ్ళకుండా కబుర్లు చెప్పుకుంటూ బాబా కళ్ళబడ్డారు. కోపంవచ్చింది. బువాసాహెబ్‌కి చివాట్లు పెట్టారు. రావ్‌సాహెబ్, నా ఆర్డర్లని ఉల్లఘిస్తున్నారని కంప్లయింట్ చేస్తుంటావ్, ఇంకా వాళ్ళు నా మాట అతిక్రమించారని, వారు నా మాట ప్రకారం పనిచేయటంలేదనీ ఫిర్యాదు చేస్తుంటావ్. మరి నీ సంగతి ఏమిటి, అని నిలదీశారు.

బువాసాహెబ్ నీళ్ళు నమిలాడు. బోర్కర్ స్థానంలో అంగల్‌ప్లీడరును టీచరుగా బాబా నియమించారు. "బోర్కరు ఆధ్యాత్మిక దృక్పథంవున్న మనిషి కాదు. యోగాసనాలు వేస్తుంటాడు. యోగసాధన వల్ల తనలో ఆధ్యాత్మికత వుందనుకొంటాడు. ఇది లాభంలేదు. అతని బదులు అంగల్ ప్లీడరును నియమిద్దాము", అని బాబా స్పష్టంచేశారు. అంగల్ నియామకం డిసెంబరు ఒకటవతేది నుంచి అమలులోకి వచ్చింది.

అంగల్ ప్లీడరు నగర్ నుంచి రోజూ మెహెరాబాద్‌కి గుర్రపుబండిలో వచ్చేవాడు. అతని ఇంటి ప్రక్కనే వో నిరుద్యోగి వుండేవాడు. అతని పేరు జి.పి.ఎడ్కె. వయస్సు – ఇరవై ఏళ్ళు. రోజూ ఉదయాన్నే టాంగాలో అంగల్ వెళ్ళడం చూశాడు. ఒక రోజున వుండబట్టలేక ఆ బండివాడిని అడిగాడు. సార్ ఎక్కడికి వెడతున్నారని. అతను వెంటనే చెప్పేడు మెహెరాబాద్‌కి అంగల్ ప్లీడరు వెడుతున్నారు. అక్కడ వో ఇరానీ ఋషి వున్నారని చెప్పాడు.

ఓహో! అలాగా అనుకొన్నాడు. ఆ ఇరానీ ఋషిని దర్శించి ఆశీస్సులు పొందితే ఎలా వుంటుందనిపించింది. ఈ కోర్కెపుట్టటానికి కారణం లేకపోలేదు. వూరిలో ఉద్యోగం దొరికింది. అక్కడికి వెళ్ళేముందు మెహెరాబాద్ వెళ్ళివస్తే బాగుంటుంది కదా అనుకొన్నాడు. నీ గుర్రపుబండిలో నన్ను కూడా తీసుకు వెడతారా అని బండివాడిని అడిగాడు. "దానిదేముంది, సార్ వెనక్కాలకూర్చుంటారు. మీరు, నా ప్రక్కన ముందు కూర్చుని రావచ్చు, అని అతను అన్నాడు.

వీళ్ళు గుర్రపుబండి మెహెరాబాద్‌కి చేరేసరికి, బాబా జోపిడీదగ్గర కూర్చున్నారు. ఎడ్కెని చూస్తూనే దగ్గరకు రమ్మని పిలిచారు. కుశల ప్రశ్నలు వేశారు. నీపేరేమిటి, ఏం చేస్తున్నావని అడిగారు. వెంటనే ఎడ్కె తనకథ చెప్పాడు. జేబులోని పోస్టు కార్డుతీసి, బాబా ఇది నా కొత్త ఉద్యోగ నియామక పత్రం అన్నాడు. బాబాకి ఇస్తే, ఆయన విష్ణుకి ఇచ్చి అందులో ఏం వ్రాసుందో పైకి చదవమన్నారు విష్ణు చదవటడం పూర్తి కాగానే, దాన్ని కిరసనాయిల్‌లో ముంచి తగల బెట్టమన్నారు. "ఎక్కడికో పోవటందేనికి మాకిక్కడ

హైస్కూలు వుంది. టీచర్లుకావాలి. నీకిష్టమైతే, రేపే వచ్చి చేరు, అని ఎడ్కెకి చెప్పారు. అతను మహద్భాగ్యం అంటూ సంతోషంతో తలాడించాడు.

అప్పటినుంచి రోజూ ఉదయాన్నే ఎడ్కె కాలినడకన మెహెరాబాద్‌కి వచ్చేవాడు. కొత్త ఉద్యోగం మొదటి రోజున ఏడుగంటలకే వచ్చాడు. అప్పుడు బాబా మెహెరాబాద్‌కొండ దిగివస్తున్నారు. వెంటగొడుగు పట్టుకొని షాహనేమామ నడుస్తున్నాడు.

ఎడ్కెని చూస్తూనే అతన్ని బాబా దగ్గరకి రమ్మని పిలిచి, వో హిత వాక్యం చెప్పారు. పిల్లలు ఎవరిపైనా చేయి చేసుకోవద్దని స్పష్టంచేశారు. ఎవర్ని తిట్టవద్దన్నారు. పిల్లలు నీ మాట వింటున్నారా లేదా అని తర్జన బర్జనపడకు. మనస్సుపెట్టి పాఠం చెప్పు. ఇది చాలు, అని అన్నారు. ఎడ్కెకి అప్పగించిన పని ఇంగ్లీషు, మరాఠీ పాఠాలు చెప్పడం. శ్రద్ధగా చెప్తున్నాడు పాఠాలని. వో రోజున పిల్లల నోటు పుస్తకాలు చూసి అవాక్కయ్యాడు. అందులో తను చెప్పిన నోట్సు కనబడలేదు. ప్రతి నోటు పుస్తకంలో బాబా నామమే దర్శనమిచ్చింది. పలకలపైన బాబా నామమే కనిపించింది.

ఇది ఏమిటి, పిల్లలకి చదువుపై శ్రద్ధలేదా? అని ఆశ్చర్య పోయాడు కొత్త టీచరుగారు. ***(సశేషం)***

# శ్రీకాకుళం కేంద్రం

అవతార్ మెహెర్‌బాబా, శ్రీకాకుళం కేంద్రం ఈ సంవత్సరం వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చుటకుగాను చిన్నబజార్ రోడ్డులో చలివేంద్రం ప్రారంభించడమైనది. 27.04.2009 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు బాటసారులకు మజ్జిగ, మంచినీళ్ళు చలివేంద్రంలో పంపిణీ చేయుచున్నారు. మే నెలాఖరు వరకు నిర్వహించబడును. ప్రతీ రోజూ 10 లీటర్ల పాలు మజ్జిగ చేసి పంచబడుచున్నది.

అవతార్ మెహెర్‌బాబా నామ వ్యాప్తికై గ్రామీణ కార్యక్రమములు చేయు సంకల్పంతో ఈ నెల అనగా 1.5.2008 సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు శ్రీకాకుళం పట్టణమునకు 15 కి.మీ. దూరములో గల లోలుగు గ్రామములో మెహెర్‌బాబా సంకీర్తన కార్యక్రమము ఏర్పాటు చేయబడినది. ఇందు సోదరులు డి.శ్రీనివాసరావు బాబా జీవిత విశేషములపై ప్రసంగించిరి. ఈ కార్యక్రమములో సుమారు 150 మంది ప్రేమికుల పాల్గొని బాబా జీవిత విశేషములు తెలుసుకొని ఆనందించిరి. ఈ కార్యక్రమము లోలుగు గ్రామ సర్పంచు మరియు ఇతర గ్రామస్తుల సహకారంతో నిర్వహించబడినది. కార్యక్రమము ఆద్యంతము చక్కని సంకీర్తనలు, ఉపన్యాసములతో కడురమ్యంగా సాగినది.





# గుంటూరులో

శ్రీరామనవమి సందర్భంగా 5.4.2009 ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి 7.30 వరకు శ్యామలానగర్, 8వ లైన్‌లో గల సీతారామనగర్, ఎన్.జి.ఒ కాలనీలోని సీతారాముల కళావేదికపై బాబావారి భజన కార్యక్రమాలు నిర్వహించినట్లు శ్రీ కె.కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సరావుపేట సెంటర్ ప్రేమికులు శ్రీ ఎమ్.వి.కేశవరావు, శ్రీ బి.వి. సుబ్బారావు భజన సంకీర్తనలు గానం చేశారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, హైదరాబాద్ అవతారుని విశిష్టతపై ప్రసంగించారు.

10.04.2009న అవతార్ మెహెర్‌బాబా కదిరి సెంటర్ ప్రేమికులు సుమారు 16 మంది గుంటూరు బాబా కేంద్రాన్ని సందర్శించి భజనలు, ప్రార్థనలు చేశారు. అనంతరం విజయవాడ మీదుగా మచిలీపట్నం, తాడేపల్లిగూడెం, తుని, రాజమండ్రి, కొవ్వూరు సెంటర్‌లను సందర్శించేందుకు బయలుదేరి వెళ్ళారు.

ఏప్రిల్ 11, 12 తేదీలలో కొవ్వూరులోని మెహెరస్థాన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహవాస్‌లో పాల్గొన్న 141 మంది హమీర్‌పూర్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మెహెరాబాద్ సెంటర్ల బాబా ప్రేమికులు గుంటూరు సెంటర్‌ను సందర్శించి బాబా ప్రార్థనలు చేశారు. ముందుగా వారు తాడేపల్లిగూడెం, ఏలూరు, గుంటూరు, విజయవాడ సెంటర్లను సందర్శించారు.

ఏప్రిల్ నెలలోని మండువేసవిలో బాబా ప్రేమికుల విశేష రాకతో గుంటూరు బాబా సెంటరు పలు కార్యక్రమాల ఏర్పాటుతో బహు కళకళలాడిందని శ్రీ కనకయ్య అన్నారు.

# రాజాం వార్షికోత్సవం

రాజాం సెంటరు వార్షికోత్సవం, ప్రేమిక సహవాస్ 3.5.2009న జరిపినట్లు శ్రీ పి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సప్తవర్ణ పతాకాన్ని శ్రీమతి భాగ్యలక్ష్మి గారు ఎగురవేశారు. శ్రీ జి. కృష్ణమ నాయుడు (పాలకొండ), శ్రీమతి జి. సుబ్బలక్ష్మి (విజయవాడ), శ్రీ బి.వి.రమణ, మున్సిపల్ కమీషనర్, పలాస, తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. మెహెరాంజలి నృత్యరూపకాన్ని చి. జి.యం. ఆశ్చర్య బృందం కడు రమ్యంగా ప్రదర్శించారు. శ్రీ డి. శ్రీనివాసరావు , శ్రీకాకుళం, చిన్నారులకు మెమెంటోలు బహూకరించారు.

# బాటసారులు

ఒకమారు ఆలీషాతో సంప్రతించిన యనంతరము బాబాను చూచి నేను చాలా అలసినట్లున్నారే అని అన్నాను. అప్పుడు బాబా ఆలీషా జోగుతూ బద్ధకంగా ఉన్నందువలన తాను చాలా కష్టపడి పనిచేయవలసి వచ్చినదని వివరించి చెప్పడం నాకు జ్ఞాపకం ఉన్నది. ఆలీషా ఎల్లప్పుడు సాధుస్వభావంగా ఉండెడివాడు. అతను అల్ప సంతోషి. ఆయన పనులు చక్కగా నెరవేరవలెనన్నచో మస్తును ముందుగా మంచి ఖుషీగా చేయవలెనని బాబా తరచుగా చెప్పుచుండెడివారు.

ఆధ్యాత్మికంగా ఒక కార్యం చేయవలెనంటే వెంటనే బాబాకు సహాయపడుటకు ఆలీషా సిద్ధముగా ఉన్నట్లు బాబాకు తోపింపజేసెడివాడు. బాబా యొక్క శిష్యులు అనేకమంది ఉంటున్న అహమ్మద్‌నగర్‌లోనే ఆలీషా నివసించేడివాడు కావున సులభముగా దొరకెడివాడు. ఏ అడ్డంకులు చెప్పకుండ బాబా పిలవగానే హాజరయేవాడు. గొడవలేకుండా ప్రశాంతంగా ఉండే ఒకగది, కావలసినన్ని సిగరెట్లు ఉంటే అతడు ఎక్కడైనాసరే ఉండగలిగేవాడు.

బాబాతో ఆలీషాకు కలిగిన ఇరువది పర్యాయములు సాంగత్యములలో ఒకటి మాత్రం చాలా ముచ్చటగా ఉండినది. అప్పుడు బాబా అంగీరస ఋషి కొండమీద ఏకాంతవాసంలో ఉండెడివారు. మధ్య పరగణాలలో క్రూరమృగ సంకీర్ణమైన యరణ్య ప్రాంతములో రాయపూర్‌కి దక్షిణంగా నూరుమైళ్ళ దూరమున నుండెడిది వారి ఆశ్రమము. పవిత్ర మహానది పుట్టిన చోటుకు సమీపములోనే, మహానదిలో కలియుటకు వేగముగా రాళ్ళమీదనుండి జలజల ప్రవహించు సెలయేరులు వాటి గట్టులనునున్న రాతి ప్రదేశములు కనపడకుండా పెరిగిన దట్టమైన పచ్చని వనములు చూచుటకు రమణీయకముగా నొప్పారుచుండెను.

నిర్మానుష్యమైన ఈ యడవులలో పూర్వము నలుగరు ఋషులు నివసించెడివారు. ఆ పరిసరములనున్న గ్రామములందు ఇప్పటికిని వారి చరిత్రలు చెప్పుకొనుచుందురు. ఆ నలుగురు అంగీరసుడు, శృంగి, ముచుకుందుడు, కున్మగ్ ఋషి.

బాబా తన ఏకాంతవాసమున కనువగుచోటు చూడమని జాల్ కేరావాలాను కోరగా అతడు ఈ అంగిరసఋషి ఉండెడి కొండమీద ఏర్పాటు చేసెను. ఆ గిరి శిఖరముమీద ఒక కుటీరమును నిర్మాణము చేయించి, గజిబిజిగా నున్న మార్గమును కారులు పోవుటకు వీలుగా చక్కజెయించి, నీరు, పాలు, కూరగాయలు వగైరా





కొండమీదకు తెచ్చుటకు మనుష్యులను నియమించి ఇంకా బాబా అక్కడ ఏకాంతముగా నివసించుటకుకావలసిన అన్ని ఏర్పాట్లు చేయించెను.

1945 సంవత్సరం అక్టోబరు 31వ తేదీన బాబా పరివారసమేతుడై ఈ కొండపై విడిదిచేసిరి. నాలుగురోజులు ఆలీషాతో ఏకాంతంగా గడిపిరి. ఆలీషా నివాసము కొరకు వేరే కొండ చివరకు కొంచెం దిగువభాగంలో ఒక గుడిసె కట్టించిరి. అందులోనే ఈ నాలుగురోజులు- ఆలీషాతో బాబా కూర్చొనియుండిరి. తరువాత ఆలీషా అహ్మద్‌నగర్‌కు పంపబడెను. ఆఖరువారము కొండశిఖరముననున్న తన ప్రత్యేక కుటీరములో బాబా ఉండి తన మౌన కార్యక్రమము కొనసాగించెను.

ఆ దినములలో ఒకనాడు గంటలతరబడి ఏకాంతంగా కూర్చొనియుండి బాబా బయటకువచ్చిరి. అప్పుడు ఆయన ముఖము చాలా శ్రమతో అలసిపోయి పీక్కుపోయినట్లు కనిపించినది. అంత ఇదిగా బాబా ముఖం ఉండడం ఆది ఎప్పుడూ చూచియున్నట్లు జ్ఞాపకంలేదని చెప్పెను. ఇవతలికివచ్చి బాబా ప్రపంచమునకు బ్రహ్మాండమైన ఆపదరానున్నదని అందులో మానవజాతి మూడువంతులు ఆ ఘోరమైన విపత్తునందు నశించునని చెప్పిరి. బాబా ముఖముమీద ద్యోతకమయిన ఆవేదనవలన, బాబా కుటీరమునుండి వచ్చీరాగానే ఆయన ఈ మాటలు చెప్పుటబట్టి **ఆది** చాలా ఆందోళన చెందెను. బాబా ఏకాంతమునందు గావించిన పని ఈ ప్రపంచమునకు రానున్న భయంకర పరిస్థితి గురించే అయియుండునని అతడికి తోచెను. ఇంకొక అసాధారణమైన ఘట్టము మొగలాయిలనుండి శివాజీ వశపరచుకొనిన కోటలలో ఒకదానిలో బాబా ఏకాంతవాసమున్నప్పుడు ఆలీషా అందులో పాల్గొనినది. దక్షిణ దిక్కునుండి బాటసారి పూనానగరమును సమీపిస్తూంటే పూనా ఇంకా 40 మైళ్ళుందనగా మార్గము రెండు కొండలమధ్యగుండా ఎగువగా వెళ్ళి అక్కడనుండి 80 అడుగులు దిగువకు తిరుగును. అక్కడనుండి క్రింద సాగుచేయుటకు తగిన పొలాలు నీరానదికి యిరుప్రక్కల కనబడుచుండును. ఈ కొండల మధ్యమార్గమునుండి చూస్తే ఉత్తరంగా ఎగుడుదిగుడుగా ఎత్తుగా పురంధర్, వజీర్‌బాగ్ అను రెండు కోటల అంచులు ఆకాశంమీద కనుపించును. ఆ రెండింటిలో ఎత్తయిన పురంధర్‌కోట శిఖరము సముద్రమట్టమునకు పైన 4500 అడుగులు ఉండును.

1947వ సంవత్సరం మార్చి నెలలో శివాజీకి సంబంధించిన ఒక స్థలమునందు తాను ఏకాంతవాసముచేయ సంకల్పించినానని బాబా ప్రకటించగా ఆచరణ యోగ్యమైన కారణములవలన పురంధర్ అందులకు తగినట్లుగా ఉన్నదని ఎంచబడినది. అహమ్మద్‌నగర్ నుండి ఆలీషాను తీసుకొనివచ్చిరి. అతడు అక్కడ బాబాతో 8 రోజులుండెను. ***(సశేషం)***

## పుస్తక సమీక్ష

# Growing up with God




**‘దే**మునితో పెరుగుతూ...’, అన్న కొత్త పుస్తకం 800 పేజీల ఉద్గ్రంథం. సుమారు 140 ఫోటోలున్నాయి. చాలా ఫోటోలు అరుదైనవి. వాటిని ఇంతవరకూ ఎక్కడాచూడలేదు. పుస్తక రచయిత పేరు షీల, ఆమె తండ్రి, భావూగా మనందరికీ చిరపరిచితుడైన వి.ఎస్. కల్చూరి. ఈమె భర్త డేవిడ్ ఫెన్‌స్టర్ కూడా గొప్ప రచయిత. బాబా భక్తుడు. గతంలో **మెహెరా** కథని పుస్తక రూపంలో తెచ్చారు. షీలా రచనకు సహాయ మందించారు. ఆమె చిన్ననాట అనుభవాలు, అనుభూతులును చక్కని శైలిలో, వ్రాశారు. నాల్గేళ్ళ పిల్లగా షీల బాబా సన్నిధికి వచ్చి చేరింది. అది ఎలాగున అంటే, తండ్రి 1953లోనే బాబామండలిలో చేరారు. మీరు నా దగ్గరకి వచ్చి వుండండని బాబా వీరికి 1957లో పిలుపునిచ్చారు. తల్లి – రమ, తమ్ముడు మెహెర్‌నాథ్‌లతో వెంటనే షీల మెహెరాబాద్‌లో అడుగు పెట్టింది. అక్కడే అక్క, తమ్ముడు చాలా వాళ్ళు వున్నారు. హైసూల్లో చదువులకోసం వీరిమకాన్ని అహమ్మద్‌నగర్‌కి బాబా మార్పించారు. ఖుస్రూ క్వార్టరు ఇప్పటి ట్రస్టు కాంపౌండ్‌లో వో రెండు గదుల్లో వుండమన్నారు. ఆదివారం వచ్చినా, స్కూలుకు శలవచ్చినా షీలా, మెహెర్‌నాథ్‌లు బాబా దగ్గరకి పరుగెత్తేవారు. మా నాన్న బాబా అనే అంటారు వీరిద్దరు.

బాబాతో జీవించటమంటే ఏమిటో తెలుసుకోవాలంటే, ఈ పుస్తకం చదివి తీరాల్సిందే అంటున్నారు. ఇంతకాలం మనకి బాబా సేవలో పండిపోయిన పెద్దల రచనలే తెలుసు కానీ వో చిన్న పిల్ల దృక్కోణంలో నుంచి వెలువడిన పుస్తకం లేదు. ఈ లోటు ఇప్పుడు తీరిందనాలి. బాబా దగ్గర భావూ నైట్‌వాచ్‌మన్‌గా వుండేవారని మనకి తెలుసు. కానీ ఆ విధిలో ఆయన సాధకబాధకాల గురించి మనకి తెలీదు, ఎందుకు తెలీదు అంటే, వాటి గురించి ఎవ్వరూ చెప్పలేదు కాబట్టి. ఇప్పుడు పుణ్యమా అని షీలా మనకి ఆ భోగట్టా







తెలుస్తోంది. బాబాని భావూ ఎంతగా ప్రేమిస్తారో, ఎంత గాఢంగా ఆరాధిస్తారో, బాబా సేవలో ఆయన ఎన్నికష్టాలు పడ్డారో, ఎలా రాటు తేలారో చక్కగా వివరించారీ కొత్త పుస్తకంలో.

మానవాళిని మేల్కొల్పడానికి వచ్చిన అవతారుడు, వో చిన్న పిల్ల గురించి పట్టించుకొంటారా? ఆ పిల్ల మనసులో దాగివున్న భావాలకి స్పందిస్తారా? ఈ ప్రశ్నలు, పుస్తకం పేరు చదవగానే ఎదురవుతాయి. పుస్తకాన్ని ఆసాంతం చదివితే, ఈ ప్రశ్నలకి జవాబు దొరుకుతుంది. తండ్రికి తగ్గ పిల్ల షీలా. అందుకనే ఎంతో దైర్యంగా బాబా సన్నిధిలో మెలగడమేకాదు చిక్కు ప్రశ్నలనికూడా వేసేది. మనకి తారసపడేవారు గ్రహాంతర వాసులు కారని ఎలా తెలుస్తుందని అడిగిందోరోజున. ప్రపంచంలో చెడ్డవాళ్ళని చంపేయకుడదూ? అని ప్రశ్నించిదోసారి. పోనీ అందర్నీ మంచివాళ్ళని చేసేయి అంది ఇంకోసారి. ఒకసారి ధర్మసందేహం వచ్చింది. ఠపీమని అడిగేసింది. ‘బాబా ప్రపంచంలో కురూపులని ఎందుకు పుట్టించావు. అని షీలా అడుగుతుంటే, ‘ఔరా! ఏమీ! ఈ పిల్ల సాహసం, ఎంతధైర్యంగా అడుగుతోంది’ అని చూసేవాళ్ళు ముక్కున వేలు వేసుకొన్నారట.

ఈ గడుగ్గాయి అంతటితో వూరుకోలేదు. బాబా! నాకు శక్తిని ప్రసాదించు. ప్రపంచంలో అడ్డదిడ్డంగా కనిపిస్తున్నవాటి రూపురేఖలని మార్చేసి, కొత్తగా సృష్టిచేస్తానంది. లాటరీలో జాక్‌పాట్ కొట్టాలనుంది బాబా – నాకావరం ప్రసాదించు అని అడిగింది షీలా. బాబా వారికి మండలివారు షీలా చిన్న పాపాయి. కళ్ళముందే పెరుగుతుండటంతో ఆమె ఎప్పటికీ పాపాయే. ముద్దుగా **బేబీ** అని పిలిచేవారు.షీలా, మెహెర్‌నాథ్‌ల పుట్టిన రోజు వేడుకలు బాబా సమక్షంలో జరిగేవి. అక్క – తమ్ముడు గొడవ పడుతుంటే బాబావారు ఇద్దరినీ దగ్గరకి తీసుకొని, లాలించి బుజ్జగించేవారు. తగువు తీర్చేవారు. భగవంతుని ఎలా ప్రేమించాలో అలా ప్రేమించగల వొకేవొకవ్యక్తి మెహెరా. ఆమెని మెప్పించటం మాటలుకాదు. కానీ ఆ కిటుకును బాబావారే షీలాకి నేర్పారు. అంతే ఇంకే కావాలి. షీలా అంటే మెహెరాకి ఎక్కడలేని ఆప్యాయత కల్గింది. ఎన్నోసార్లు పింపలగామ్‌కి పిలిపించి గోరుముద్దలు తినిపించింది. ఇలాంటివి ఎన్నో మధుర ఘట్టాలు షీలా రచనలో మనను దర్శనమిస్తాయి.ప్రధానంగా అహ్మద్‌నగర్ సెంటర్‌లో ఈ పుస్తక ప్రతులు లభిస్తున్నాయి.

# భైరమంగళలో బాబా ప్రేమిక సహవాస్

**(పి.యస్.కె.శర్మ, బెంగుళూరునుంచి)**



బెంగళూరుకు సమీపంలోగల భైరమంగళలో రెండురోజుల బాబా ప్రేమిక సహవాస్ మే 9, 10 తేదీలలో ఘనంగా జరిగాయి. సుమారు 400 మంది బాబా ప్రేమికులు పలుప్రాంతాలనుండి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైరమంగళ విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర ప్రాంగణంలో ఇటీవల నిర్మాణం పూర్తయిన బహుళప్రయోజన సభా ప్రాంగణాన్ని అహ్మద్‌నగర్ నుండి ప్రత్యేక అతిధిగా విచ్చేసిన శ్రీ యల్.బి. థాడే లాంఛనంగా మే 10న ప్రారంభించి బాబా ప్రేమికులకు అంకితమిచ్చారు. అలాగే, ఈ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పలు ఇతర చిన్నపాటి భవనాలను ఆనాడు ప్రారంభించారు. ఈ భవనాలన్నింటికీ 2004 మార్చి 2న శ్రీ కె.కె.రామకృష్ణన్ శంఖుస్థాపన చేశారు.

ముందుగా, మే 9 ఉదయం 10.40 నిముషాలకు అవతారుని సప్త వర్ణ పతాకాన్ని బాబా ట్రస్టీ సభ్యులు శ్రీ శ్రీధర్ కేల్కర్ అవిష్కరించారు. శ్రీ థాడే బృందం సప్త వర్ణ పతాక గీతాన్ని హృద్యంగా ఆలాపించారు. అవతారుని సప్త వర్ణ పతాకాన్ని ఎగురవేశాక ఏడుసార్లు బిగ్గరగా అవతారుని నామాన్ని జయజయకారం చేయాలని, అలాగే, పతాక గీతాన్ని తప్పక ఆలాపించాలని శ్రీ థాడే సూచించారు. ఈ విషయం తెలుగు బాబా ప్రేమికులందరూ తప్పక గ్రహించాలి.

రెండు రోజుల ప్రేమిక సహవాస్‌ను సమర్ధవంతంగా బెంగుళూరు సెంటర్ ప్రేమికులు శ్రీ కె. సుబ్రహ్మణ్యం నిర్వహించారు. అమెరికాదేశ యాత్రలో వున్న బాబా ట్రస్టు చైర్మన్, శ్రీ భావూ కల్చూరీ తన సందేశాన్ని పంపారు. మన కోసం తక్కువగాను, అవతారుని కోసం అధికంగా జీవించాలని శ్రీ భావూ తన సందేశంలో పేర్కొన్నారు.

ముందుగా శ్రీ శ్రీధర్ కేల్కర్ ప్రసంగిస్తూ, సహవాస్‌కు హాజరయితే, కుటుంబసభ్యుల్ని కలుసుకున్నట్లు వుంటుందని అన్నారు. బాబాను అనునిత్యం తలుచుకుంటూ, ఆయన్ని మన నిత్య సహచరునిగా చేసుకోవాలన్నారు. చాలామంది బాబాను అనుసరించడం







**బహుళప్రయోజన సభా ప్రాంగణాన్ని శ్రీ యల్.బి.థాడే మే 10న ప్రారంభించారు.**

చాలా సుళువనుకుంటారు. ఎందుకంటే ఈయనకు కర్మకాండలు లేవు. పూజాది క్రతువులు లేవు. తద్వారా ఖర్చులు తక్కువ కదా అనుకుంటారు. బాబాను సుఖదుఖాల్లో నిరంతరం గుర్తుంచుకొమ్మనమని ఆయన సలహా ఇచ్చారు. బాబాను నమ్మినవారు మరే ఇతర దేవాలయాలకు వెళ్ళాల్సిన పన్లేదు. తీర్ధయా త్రలతో అసలే పనిలేదు అని శ్రీధర్ అన్నారు. బాబా అన్నింటా అందరిలో వున్నారని ఆయనన్నారు. ఆయన్ని అనుక్షణం స్మరించుకుంటూ తరించాలని సలహా ఇచ్చారు.బాబా అందర్నీ తగిన సమయంలో ఆదుకుంటానన్నారు. అది వారి వారి అర్హతనుబట్టివుంటుందన్నారు.

ఈ విషయంలో బాబావారి దర్బారులో జరిగిన సంఘటనను శ్రీధర్ ఇలా చెప్పారు.

బాబా ప్రేమికులలో ఒకరైన చిన్న వ్యాపారిని తన వ్యాపారం వృద్ధిచెందేలా, బాగా ధనం సంపాదించేలా ఆశీర్వదించమన్నాడు. బాబా ఏమన్నారంటే, నేనే నీకు దగ్గరగావుండగా, ఇంకా నీకు ధనంతో పనేముందన్నారు. అలా కాదు బాబా .....అన్నింటికీ ధనం ప్రధానం కదా... తన చిన్న కోర్కెను కాదనవద్దన్నాడు. ఎంతో ప్రాధేయపడ్డాడ. బాబా సరేలే అన్నారు. కొన్నాళ్ళకే బాగా ధనవంతుడైపోతాడు. ఇబ్బడిముబ్బడిగా ధన సంపాదన వుంటుంది. క్రమేణా బాబా దగ్గరకు రావడానికి కూడా తగినంత సమయం చిక్కదతనికి. దురలవాట్లకు, వ్యసనాలకు లోనవుతాడు. ఆ తర్వాత కష్టాలు అధికమౌతాయి. అనంతరం,

# భైరమంగళ - చారిత్రక విశేషాలు

భైరమంగళలో 574 ఎకరాల భూమిని 1939లో మెహెర్‌బాబా కొనుగోలు చేశారు. అనంతరం మెహెర్‌బాబా స్వయంగా విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం కోసం 1939 డిశంబరు 17న వేలాదిమంది జనసందోహం హర్షధ్వానాల మధ్య భూమిపూజ ఎంతో వేడుకగా నిర్వహించారు. ఇందుకోసం ఏడు ధాతువులతో తయారుచేయించిన పారను బాబా వాడారు. పెద్ద బహిరంగ సభ- దర్శన కార్యక్రమాలు నిర్వహించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో 1940 ఏప్రిల్ 1న ఆ భూమినంతా వదిలి మెహెరాబాద్‌కు వెళ్ళిపోయారు. ఆ తర్వాత 1949 అక్టోబరు 16న నవజీవన కార్యక్రమం చేపట్టడంతో మొత్తం భూమిని బాబా అమ్మివేశారు. కొంత భాగం దానంగాను, మరికొంత ఉచితంగా ప్రభుత్వానికి- అలాగే తన దగ్గర పన్జేసే పనివాళ్ళకు ఇచ్చారు. కొంతభాగం శ్రీ వెంకోబరావు కొనుక్కున్నారు. ఆదరిమిలా వెంకోబరావు కొనుగోలు చేసిన స్థలాన్ని కూడా పూర్తిగా 1964లో అమ్మివేశారు.

1964 తర్వాత భైరమంగళ పూర్తిగా అన్యులచేతిలోకి వెళ్ళిపోయింది. ఐతే, 1982 లో ఈ ప్రాంతంలో తిరిగి ఇక్కడ విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర నిర్మాణం తలపుకొచ్చింది. అందుకోసం నిర్మాణ కమిటీలు ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత ఏ ప్రాంతంలోనైతే భూమిపూజ జరిగిందో, తిరిగి ఆ ప్రదేశంలోనే నేడు బాబా ఊహించినట్లు- ఆయన ఆశించిన విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర నిర్మాణం పనులు పూర్తిచేసి, ఆయన నూరవ జన్మదినంనాడు ప్రేమికులకు అంకితమిచ్చారు.

ఏమి ఇదంతా? ఏమి ఆయన లీల? ఏం జరిగింది? ఏమంటే- అసలు కర్ణాటక రాష్ట్రంలో గల మైసూరు- బెంగుళూరులతో మెహెర్‌బాబాకు గల ఆధ్యాత్మిక సంబంధం 1930 దశకం నాటి నుంచి ఉంది. పరమ విశిష్ట ఆధ్యాత్మిక కేంద్రం భైరమంగళను వీలుచిక్కితే తప్పక సందర్శించండి......

తెలియని మనోవ్యధతో ఆత్మహత్య చేసుకుంటాడు. ఆతని భార్య బాబా దగ్గరకొచ్చి, తన భర్త తప్పు చేశాడని, నీ చెంత ఉండి తన శేష జీవితం గడిపేందుకు బాబా అనుమతి కోరుతుంది. ఇలా శ్రీధర్ తాను చెప్పదల్చుకున్నది చెప్తూ, గాతే చలో, మెహెరు, మెహెరు .. గాతే చలో... సుఖ్‌మె భూలో నహీ....అంటూ **గాతే చలో గీతాన్ని** గుర్తుచేసుకోవాలని ప్రతిఒక్కరకీ సలహా ఇచ్చారు.







శ్రీ కె. సుబ్రహ్మణ్యం, బెంగుళూరు, అవతారుని జీవిత సమయంలో మే నెలలో జరిగిన పలు విశేషాలను చదివి వినిపించారు.

మే 8, 9 తేదీలలో భైరమంగళలో పెద్ద ఎత్తున వాన పడింది. దీంతో కార్యక్రమ ఏర్పాట్లల్లో కొంత ఇబ్బందిని ఎదుర్కొన్నారు.

ఈ విషయమై ముఖ్య అతిధిగా, అహ్మద్‌నగర్‌నుంచి విచ్చేసిన శ్రీ యల్.బి. థాడే మాట్లాడుతూ, బాబా కార్యక్రమాలకు ముందు ఎక్కడైనా సాధారణంగా మంచి వర్షం కురుస్తుంది. ఇది ఒక మంచి ఆనవాయితీ అన్నారు. మీలో చాలామందికి తెలుసంటూ, 1962లో పూనేలోని గురుప్రసాద్‌లో ఏర్పాటుచేసిన ఈస్ట్-వెస్ట్ మహా సమావేశ సమయంలో కూడా భారీ వర్షం కురిసిందని శ్రీ థాడే గుర్తుచేశారు. ఇది ఒక శుభ సూచకంగా మనం భావించాలన్నారు. ఈస్ట్-వెస్ట్ మహా సమావేశంలో భారీ వర్షం కురిసినా, ఎవరి స్థానాల్లోవారు కదలకుండా కూర్చున్నారన్నారు. సహవాస్ సమయంలో బాబా తన హృదయం తెరచివుంచుతానని అన్నారు. కాబట్టి సహవాస్‌లో తన ప్రేమను తనివితీరా ఆస్వాదించమని బాబా అన్నారు. బెంగుళూరు, మైసూరుల నడుమ బాబా 1939లో పలుమార్లు మస్తులతో సహవాసం చేశారు. సుమారు ఆరు మాసాలు పైగా బాబా ఇక్కడ మస్తుల కార్యక్రమం చేశారు. మెహెరాబాద్ నుండి తన మండలివారినందర్నీ, జంతుజీవాలతో సహా ఈ ప్రాంతంలో స్థిరపడాలని, ఇక్కడనుంచే తన విశ్వకార్యక్రమం నిర్వహించాలని బాబా తలపెట్టారు. ఆ మాదిరిగా చూస్తే ఈ

ప్రాంతం చాలా పవిత్రమైందని శ్రీ థాడే అన్నారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బాబా ఇక్కడ్నుంచే తన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. హిట్లర్ వక్రమార్గంలో వెళ్తున్నాడు కాబట్టి , ఆతని మనుష్యులే ఆతన్ని చంపుతారని బాబా ముందుగా హెచ్చరించారు. మహా గొప్ప మస్తులు – చట్టిబాబా, ఫుల్ బాబాలతో బాబా ఈ ప్రాంతంలోనే తొలిసారిగా సమావేశమయ్యారని శ్రీ థాడే అన్నారు. 1939 అక్టోబరు 17న బాబా ఇక్కడ విశ్వ ఆధ్యాత్మిక కేంద్రానికి పునాదిరాయి వేశారు. ఇక్కడ బాబా అనంతమైన ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదించారు. భైరమంగళను ప్రతిఒక్కరూ తప్పక వీలుచూసుకుని సందర్శించాలని శ్రీ థాడే అన్నారు. బాబావారి దర్బారుకు ఎంట్రన్సు గేటు మాత్రమే వుంది. నో ఎగ్జిట్ ద్వారం ... అని ఆయన చమత్కరించారు. బాబా పరిధిలోకి వచ్చాక ఆయన్ని కాదని వెళ్ళడం అంత సుళువుకాదన్నారు. 700 సంవత్సరాలకో-- 1400సంవత్సరాలకోగాని అవతారుని ఆలంబన,అనుభూతి అందరికీ దొరకదు.కాబట్టి అవతార్ మెహెర్‌బాబాను నిరంతరం స్మరించమని అన్నారు.

శ్రీ బి. రామక్రిష్ణయ్య, హైదరాబాద్, మాట్లాడుతూ అవతారుడు ప్రేమ స్వరూపుడు. అవతారుడు అందించే ప్రేమను బాబా ప్రేమికులు అందిపుచ్చుకునేందుకు ఎల్లవేళలా సిద్ధంగా వుండాలని అన్నారు. శ్రీ నిరంజన్, (చెన్నై) సంపత్ అయ్యంగారి ముని మనుమడు. ఆయన మాట్లాడుతూ బాబా బెంగుళూరుకు 10 సార్లు, చెన్నైకు 4సార్లు వచ్చారన్నారు. బాబా భైరమంగళలో విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం శంఖుస్థాపన సమయంలో (1939లో) గులాబీ కోటు ధరించారు. మీకు తెలుసా? 1980లో శ్రీ కె. కె. రామకృష్ణన్ (పూనే ) తొలిసారిగా భైరమంగళకు 1980లో వచ్చినప్పుడు తిరిగి బాబా అదే గులాబీ కోటుతో ఆయనకు దర్శనమిచ్చారు. ఆ స్ఫూర్తితోనే భైరమంగళలో విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర నిర్మాణానికి ఆయన నడుంబిగించారని అన్నారు. మెహెర్ గజిట్ బాబావారి మాస పత్రిక కూడా ఈ ప్రాంతంనుండే వెలువడింది. సంపత్ అయ్యంగార్, ఇక్కడకు సమీపంలోని శంకరాపురంలో వుండేవారు. బాబా వారింటికి చాలాసార్లు వచ్చారని శ్రీ నిరంజన్ వివరించారు.

డా. లక్ష్మీనారాయణ (హైదరాబాదు), ఏ.యస్. జగన్నాథ్, శ్రీ వెంకబరావ్, శ్రీ రాజగోపాల్ (బెంగళూరు), శ్రీ రాధా కృష్ణమూర్తి, శ్రీ మోహనరావ్ , శ్రీ సి. వై. చింతామణి (విజయనగరం), ప్రభృతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు,

**భజనలు**.... శ్రీ శ్రీనిబాబా ఆధ్వర్యంలో చక్కని సంగీత భరిత కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే, బాబా ప్రేమికులు-- కదిరి సెంటర్, హిందుపూర్, పావగడ, ధర్మవరం, పీన్యా, బెంగళూరు, భైరమంగళ, హమీర్‌పూర్ తదితర సెంటర్లువారు కడు రమ్యంగా భజన సంకీర్తనలు ఆలాపించారు. చిన్నారి బాలలు–- మన్నారి కిరణ్మయి, మేఘన, చరిష్మ చక్కని నృత్యాలు అవతారుని సందేశాలపై చేశారు. ●





# జీవిత సభ్యత్వం

## 2009 ఏప్రిల్- మే నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1 | ఏప్రిల్ 09 | కె. సదాశివరావు, విశాఖ | రు. 1000.00 |
| 2 | ఏప్రిల్ 09 | ఎమ్. శ్యామల, మారేడ్‌పల్లి, హైదరాబాద్ | రు. 1000.00 |
| 3 | ఏప్రిల్ 09 | ఎల్. హరీష్ మెహెర్, హైదరాబాద్ | రు. 500.00 |
| 4 | ఏప్రిల్ 09 | మద్దినేని మెహెర్ ప్రవీణి, బెంగుళూరు | రు. 1000.00 |
| 5. | ఏప్రిల్ 09 | ఇ. విమలాదేవి, హైదరాబాద్ | రు. 1000.00 |
| | | **మొత్తం** | **రు. 4,500.00** |

# జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు)
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. వార్షిక సభ్యత్వం రూ.100/-
4. మీ అడ్రస్సులో పోస్టల్ పిన్‌కోడ్ తప్పని సరిగా వ్రాయవలసింది.

బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు. మాకు అందిన జీవిత సభ్యుల వివరాలు ప్రతి నెలా పత్రికలో ప్రచురిస్తున్నామని గమనించగలరు.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, యాప్రాల్,**
**ప్లాట్ నెం.32, బాబాస్ హౌస్, జె.జె. నగర్ కాలనీ,**
**సికింద్రాబాద్-500 087, ఫోన్: 99595-53218.**

# MEHERABAD

**GENERAL INFORMATION**

**For Hostel C&D Reservations, Contact**

*Jal Dastoor, Hostel C&D Reservations, C/o Avatar Meher Baba Trust,Post Bag No.31, King's road, Ahmednagar- 414001, Maharashtra*

**Meher piligrim Retreat:** *Phone No.2548211*

*For MPR reservations, Contact:Piligrim Reservations, Avatar Meher baba Trust, King's Road, Post Bag 31, Ahmednagar -Maharastra 414001, Email: pimco@ambppct.org, Phone 0241-2548733*